మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

# నేటి ఈవార్తలు
NETI EVARTHALU దినపత్రిక

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

సోమవారం MONDAY 10-11-2025 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00
సంపుటి: 1 Volume:1 ǁ సంచిక: 131 Issue: 131

10 నవంబర్ 2025 - సోమవారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం దక్షిణాయనం - శరత్ ఋతువు కార్తీక మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:22 సూర్యాస్తమయం - సా. 5:37 తిథిః షష్ఠి రా. 12:13ం వరకు తరువాత సప్తమి సంస్కృత వారం ఇందు వాసరః నక్షత్రం పునర్వసు సా. 6:51 వరకు తరువాత పుష్యమి యోగం సాధ్య మ. 12:01 వరకు కరణం గరజి మ. 1:01 వరకు వనిజ రా. 12:13ం వరకు వర్జ్యం రా. 2:38 నుండి తె. 4:12 వరకు దుర్ముహూర్తం మ. 2:37 నుండి మ. 3:22 వరకు మ. 2:37 నుండి మ. 3:22 వరకు రాహుకాలం ఉ. 7:46 నుండి ఉ. 9:11 వరకు యమగండం ఉ. 10:35 నుండి ఉ. 11:59 వరకు గుళికాకాలం మ. 1:24 నుండి మ. 2:48 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:46 నుండి తె. 5:34 వరకు అమృత ఘడియలు సా. 4:30 నుండి సా. 6:01 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:37 నుండి మ. 12:22 వరకు గమనిక: "ం" అనగా మరుసటి రోజున

Published from Jagitial
www.evarthalu.com


# హైదరాబాద్ ఫైల్స్

## పాతబస్తీలో రెచ్చిపోతున్న డ్రగ్స్ ముఠాలు... బర్త్ డే పేరుతో కేకుల్లో డ్రగ్స్

**మత్తులో మైనర్ అమ్మాయిలపై ట్రాప్.. ముఠాలకు ఎంఐఎం అండదండలు.. కేంద్ర బండి సంజయ్ తీవ్ర ఆరోపణలు**



పాతబస్తీలో కేరళ ఫైల్స్ సినిమా తరహాలో హైదరాబాద్ ఫైల్స్ సినిమా జరుగుతోందని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. చార్మినార్ మాటున అంతులేని అరాచకాలు జరుగుతున్నాయని అన్నారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ప్రచారం ముగియనున్న సందర్భంగా ఆదివారం ఆయన నాంపల్లిలోని బీజేపీ పార్టీ ఆఫీస్‌లో మీడియాతో మాట్లాడుతూ.. పాతబస్తీలో అరాచకాలకు ఎంఐఎం అండదండలు ఉన్నాయని అన్నారు. బర్త్ డే పేరుతో పిలిపించి కేక్‌లో డ్రగ్స్ పెట్టి ఇస్తున్నారని ఆరోపించారు.

జూబ్లీహిల్స్, నవంబర్ 9 (ఈవార్తలు): పాతబస్తీలో డ్రగ్స్ ముఠాలు పెరిగిపోయాయని అన్నారు. మత్తులో మైనర్ అమ్మాయిలను ట్రాప్ చేస్తున్నారని ఆరోపించారు. జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు ఓటు వేస్తే ఎంఐఎంకు వేసినట్లే అని చెప్పారు. హైదరాబాద్‌ను కాపాడుకోవాలంటే.. బీజేపీ ఓటు వేయాలని కోరారు. పొరపాటున కూడా మళ్లీ ఆ రెండు పార్టీలకు ఓటు వేస్తే.. జూబ్లీహిల్స్‌లోని పార్కులను కూడా దోచుకుంటారు జాగ్రత్త అని హెచ్చరించారు. దివంగత మాజీ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌పై బీఆర్ఎస్‌కు ప్రేమ లేనేలేదని బండి సంజయ్ షాకింగ్ కామెంట్స్ చేశారు. గోపీనాథ్ ఆస్తులపై ఆమె సతీమణి సునీతతో కలిసి మాజీ మంత్రి కేటీఆర్ కుట్ర చేస్తున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. గోపీనాథ్ ఆస్తులను కాజేసేందుకు బీఆర్ఎస్ కుట్ర చేస్తోందని ఆరోపించారు. అందుకే గోపీనాథ్ ఆస్తులను తారుమారు చేసేందుకు ఈ కుట్రలకు తెరదీశారని ఆక్షేపించారు. ఒక ఓటరు కార్డులో సునీత భర్త పేరు సునీత మనోహర్ అని ఉందని... ఇంకో ఓటరు కార్డులో సునీత భర్త పేరు మాగంటి గోపీనాథ్ అని ఉందని ఆరోపించారు. ఇదిగో ఆ ఓటరు కార్డులను కాంగ్రెస్ ప్రభుత్వానికి పంపిస్తున్నానని వెంటనే విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. 2023 ఎన్నికల అఫిడవిట్‌లో మాగంటి సునీత చదువుకోలేదని రాసిచ్చారని ఆరోపించారు. హెచ్‌సీఏ (హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్)లో జరుగుతున్న జూనియర్, సీనియర్ సెలక్షన్లపై కేంద్ర మంత్రి బండి సంజయ్ తరువాయి 2 వ పేజీలో...



# దేశంలో ఉగ్ర కుట్ర!

**హైదరాబాదీ సహా ముగ్గురు ఉగ్రవాదుల అరెస్ట్.. మూడు తుపాకులు, 30 బుల్లెట్లు స్వాధీనం**

దేశవ్యాప్తంగా ఉగ్రదాడులకు కుట్ర పన్నుతున్న ముగ్గురు ఉగ్రవాదులను అహ్మదాబాద్‌లో గుజరాత్ యాంటీ-టెర్రరిజం స్క్వాడ్ (ఏటీఎస్) అరెస్టు చేసింది. గత ఏడాది నుంచి నిందితులపై నిఘా పెట్టిన గుజరాత్ ఏటీఎస్, ఆయుధాలు సరఫరా చేస్తుండగా ముగ్గురిని అదుపులోకి తీసుకుంది. విచారణ సందర్భంగా దేశవ్యాప్తంగా ఉగ్రదాడులకు వీరు ప్రణాళిక చేస్తున్నట్టు గుర్తించింది.

అహ్మదాబాద్, నవంబర్ 9 (ఈవార్తలు): నిందితుల వద్ద నుంచి రెండు గ్లోక్ పిస్టల్స్, ఒక బెరెట్టా పిస్టల్, 30 బుల్లెట్లు, 4 లీటర్ల ఆముదం నూనెను స్వాధీనం చేసుకుంది. నిందితుల్లో ఒకడైన అహ్మద్ మొహియుద్దీన్ హైదరాబాద్‌కు చెందిన వ్యక్తి అని గుజరాత్ డీఐజీ సునీల్ జోషి తెలిపారు. మరో ఇద్దరు నిందితులు ఆజాద్ సులేమాన్ షేక్, మొహమ్మద్ సుహెల్ సలీంఖాన్ ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందినవారని పేర్కొన్నారు. అహ్మద్ మొహియుద్దీన్ ఇప్పటికే పలు ఉగ్రకార్యకలాపాల్లో పాల్గొన్నాడని తెలిపారు. అహ్మదాబాద్‌కు అతడు వస్తున్నట్టు సమాచారం అందడంతో నిఘా పెట్టారు. అదాలజ్ టోల్ ప్లాజా సమీపంలో అతడిని పోలీసులు తరువాయి 2 వ పేజీలో...



# కొండగట్టు జేఎన్టీయూలో ర్యాగింగ్!

**ఇద్దరు అబ్బాయిలకు పెళ్లి చేసిన సీనియర్లు**

**అది ర్యాగింగ్ కాదు.. ఫన్నీ గేమ్: కాలేజీ ప్రిన్సిపాల్**

జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం నాచుపల్లి జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో 'ఇంటరాక్షన్' పేరుతో సీనియర్ విద్యార్థులు జూనియర్లను మానసికంగా వేధించిన ఘటన బయటపడింది. రెండు రోజుల క్రితం జరిగిన ఈ ఘటనపై తల్లిదండ్రులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ ఘటనలు ఆగకపోవడంపై ప్రశ్నలు ఎదురవుతున్నాయి.

మల్యాల, నవంబర్ 9 (ఈవార్తలు): యాంటీ ర్యాగింగ్, ఉమెన్ ప్రొటెక్షన్ కమిటీలు పనితీరుపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పోలీసులు, యాజమాన్యం భద్రతా వ్యవస్థను సమీక్షించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. నిపుణులు విద్యార్థులు ర్యాగింగ్ చర్యలను తేలికగా తీసుకోకుండా ఆగాలని హెచ్చరిస్తున్నారు. కమిటీలు చట్టపరంగా చర్యలు తీసుకోవాలనే డిమాండ్స్ వినిపిస్తున్నాయి. ఇద్దరు ఫస్ట్ ఇయర్ విద్యార్థులకు పెళ్లి చేసినట్లుగా వివాహ తంతును నిర్వహించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో.. క్యాంపస్ భద్రతపై తీవ్ర ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. బీటెక్ తరువాయి 2 వ పేజీలో...



# మాగంటి మృతి వెనుక కుట్ర!

**నా కొడుకు మరణంపై అనుమానాలు.. పోలీసులకు ఫిర్యాదు చేసిన గోపీనాథ్ తల్లి**

**కొడుకును చూసేందుకు అనుమతించలేదని ఆవేదన**

రాయదుర్గం, నవంబర్ 9 (ఈవార్తలు): బీఆర్ఎస్ దివంగత నేత, జూబ్లీహిల్స్ మాజీ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మరణం వ్యవహారం కీలక మలుపు తిరిగింది. ఆయన గుండెపోటుతో మరణించారని భావిస్తున్న తరుణంలో మృతిపై పలు అనుమానాలు వ్యక్తం చేస్తూ స్వయంగా ఆయన తల్లే పోలీసులను ఆశ్రయించడం సంచలనం రేపుతోంది. తన కుమారుడి మృతి వెనుక నిర్లక్ష్యం, కుట్ర ఉన్నాయని ఆరోపిస్తూ గోపీనాథ్ తల్లి మాగంటి మహానందకుమారి రాయదుర్గం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తన కుమారుడు ఐసీయూలో వెంటిలేటర్‌పై ఉన్నప్పుడు, చివరకు జూన్ 8న మరణించినట్లు ప్రకటించిన తర్వాత కూడా తనను తరువాయి 2 వ పేజీలో...




# ముగిసిన ప్రచారం.. రేపే పోలింగ్

## జూబ్లీహిల్స్ బరిలో 58 మంది అభ్యర్థులు

**కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ మధ్యే పోటీ.. నవంబరు 14న ఓట్ల లెక్కింపు**

జూబ్లీహిల్స్, నవంబర్ 9 (ఈవార్తలు): జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికల ప్రచారానికి తెరపడింది. గత కొన్ని రోజులుగా హోరాహోరీగా సాగిన ప్రచార పర్వం ఆదివారం సాయంత్రంతో ముగిసింది. మంగళవారం పోలింగ్ జరగనుండగా, ఎన్నికల అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ ఉప ఎన్నికలో ప్రధానంగా కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ మధ్య ముక్కోణపు పోటీ నెలకొంది. బీఆర్ఎస్ తరఫున మాగంటి సునీత, కాంగ్రెస్ తరువాయి 2 వ పేజీలో...



# ఐటం సాంగ్‌లా కేటీఆర్ ప్రచారం

**చెల్లిని, మాగంటి తల్లికి అవమానం.. మీట్ ది ప్రెస్‌లో సీఎం రేవంత్ రెడ్డి**


హైదరాబాద్, నవంబర్ 9 (ఈవార్తలు): రెండేళ్ల కాంగ్రెస్ పాలనను పదేళ్ల బీఆర్ఎస్ పాలనతో పోల్చవద్దన్నారు సీఎం రేవంత్ రెడ్డి. తమపై కేటీఆర్ చేస్తున్న విమర్శలు సినిమాలో ఐటమ్ సాంగ్‌లాగా ఉన్నాయని చెప్పారు. శ్రీలీల ఐటమ్ సాంగ్‌కు..కేటీఆర్ ప్రచారానికి తేడా లేదన్నారు. సొంత చెల్లిని, మాగంటి తల్లిని అవమానించిన కేటీఆర్ మహిళలకు రక్షణ కల్పిస్తాడా అని ప్రశ్నించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారంలో భాగంగా మీట్ ది ప్రెస్ లో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. రూ. 8 లక్షల కోట్ల అప్పుతో రాష్ట్రాన్ని అప్పగించారని మండిపడ్డారు. వాళ్ల అప్పులు తీరుస్తూ పథకాలు అమలు చేస్తున్నామని ముఖ్యమంత్రి వెల్లడించారు. రాష్ట్రాన్ని పూర్తిగా దివాళా తీయించారని ఆరోపించిన తరువాయి 2 వ పేజీలో...



## బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.12,202 |
| వెండి (గ్రాము): | రూ.165 |
| ప్లాటినం (గ్రాము): | రూ.4,389 |

## విశ్వవాణి



బత్తతల బాధితులకు శుభవార్త. తైవాన్ శాస్త్రవేత్తలు సరికొత్త సీరంను తయారు చేశారు. ఆ సీరం తలపై అప్లై చేసిన 20 రోజుల్లోనే వెంట్రుకలు తిరిగి వస్తాయట. ఎలుకలపై చేసిన పరిశోధనల్లో ఆశాజనక ఫలితాలను చవిచూశారు.




# అమెరికాలో సంక్షోభం తీవ్రం

అమెరికాలో ప్రభుత్వ షట్‌డౌన్ ప్రభావం విమానయాన రంగంపై తీవ్రంగా పడింది. ఎయిర్ ట్రాఫిక్‌ను తగ్గించాలన్న ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ ఆదేశాలతో విమానయాన సంస్థలు వరుసగా రెండో రోజైన శనివారం కూడా 1,000కి పైగా విమానాలను రద్దు చేశాయి. దీంతో దేశంలోని ప్రధాన విమానాశ్రయాల్లో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. ఫ్లైట్ అవేర్ వెబ్‌సైట్ ప్రకారం నిన్న మధ్యాహ్నానికే 1,000కి పైగా విమానాలు రద్దయ్యాయి. ముఖ్యంగా నార్త్ కరోలినాలోని షార్లెట్ విమానాశ్రయంలో అత్యధికంగా 130 విమానాల రాకపోకలు నిలిచిపోయాయి.

**రెండో రోజూ 1,000కి పైగా విమానాలు రద్దు**

**షట్‌డౌన్ కారణంగా విమానయాన సంక్షోభం**

**విధులకు గైర్హాజరవుతున్న ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్లు**

**విమానాలను తగ్గించాలని ఫెడరల్ ఏవియేషన్ ఆదేశం**

**షార్లెట్, అట్లాంటా, చికాగో విమానాశ్రయాలపై ప్రభావం**

వాషింగ్టన్: అట్లాంటా, చికాగో, డెన్వర్, నెవార్క్ వంటి ఇతర ప్రధాన ఎయిర్‌పోర్టులలో కూడా ఇదే పరిస్థితి కనిపించింది. న్యూయార్క్ నగర పరిసరాల్లోని విమానాశ్రయాల్లో సిబ్బంది కొరత కారణంగా విమానాలు ఆలస్యంగా నడిచాయి. షట్‌డౌన్ కొనసాగితే రానున్న రోజుల్లో రద్దయ్యే విమానాల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతం - 2 వ పేజీలో...




# ఆరెస్సెస్ అభిమతం

రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆరెస్సెస్) ఏ ఒక్క వ్యక్తికి గానీ, రాజకీయ పార్టీకి గానీ మద్దతు ఇవ్వదని, కేవలం దేశ ప్రయోజనాలకు ఉపయోగపడే విధానాలకు మాత్రమే కట్టుబడి ఉంటుందని ఆ సంస్థ సర్ సంఘ్‌చాలక్ మోహన్ భగవత్ స్పష్టం చేశారు. ఆరెస్సెస్ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా బెంగళూరులో రెండు రోజుల పాటు ఏర్పాటు చేసిన ప్రసంగ కార్యక్రమంలో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు.

**ఆరెస్సెస్ ఏ రాజకీయ పార్టీకీ మద్దతు ఇవ్వదు**

**రామమందిరానికి కాంగ్రెస్ మద్దతిస్తే అండగా నిలిచేవాళ్లం**

**కాషాయం మాకు గురువు లాంటిది, అందుకే ఆ జెండాను ఎగరేస్తాం**

**విమర్శలను పట్టించుకోం.. అవే మాకు ప్రచారం కల్పిస్తాయి**

**ఆరెస్సెస్ సర్ సంఘ్‌చాలక్ మోహన్ భగవత్**

బెంగళూరు, నవంబర్ 9 (ఈవార్తలు): ఓ ప్రశ్నకు భగవత్ బదులిస్తూ, "మేము ఏ రాజకీయ పార్టీకి మద్దతు ఇవ్వం. ఎన్నికల రాజకీయాల్లో పాల్గొనబోము. సమాజాన్ని ఏకం చేసే పనిలో సంఘ్ నిమగ్నమై ఉంది. కానీ రాజకీయాలు స్వభావరీత్యా విభజనకారిగా ఉంటాయి" అని వివరించారు. దేశానికి మేలుతరువాయి 2 వ పేజీలో...

## రాశి ఫలాలు

10.11.2025

మేషం: ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. చేపట్టిన పనులు వాయిదా పడతాయి. బంధువర్గంతో స్వల్ప వివాదాలు ఉంటాయి. వృత్తి, వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి. ఆరోగ్య సమస్యలు భాదిస్తాయి. ఇంటాబయట ఊహించని సమస్యలు కలుగుతాయి.

వృషభం: నిరుద్యోగుల యత్నాలు సఫలమౌతాయి. మిత్రులతో విందువినోద కార్యక్రమాల్లో పాల్గొంటారు. కుటుంబ సభ్యుల నుండి శుభవార్తలు అందుతాయి. వృత్తి, వ్యాపారాలలో మరింత అనుకూలంగా సాగుతాయి. నూతన వాహనం కొనుగోలు చేస్తారు. ఆకస్మిక ధన వస్తు లాభాలు పొందుతారు.

మిధునం: చేపట్టిన పనులు నత్తనడకన సాగుతాయి. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. కుటుంబ సభ్యులతో ఒక వ్యవహారంలో మాటపట్టింపులు తప్పవు. నిరుద్యోగులకు శ్రమ తప్ప ఫలితం కనిపించదు. వృత్తి ఉద్యోగాలు నిరుత్సాహ పరుస్తాయి. ఆదాయానికి మించి ఖర్చులు పెరుగుతాయి.

కర్కాటకం: వృత్తి, వ్యాపారాలు సంతృప్తికరంగా సాగుతాయి. కుటుంబంలో శుభకార్యాలు నిర్వహిస్తారు. స్థిరస్తి వివాదాలు పరిష్కార దిశగా సాగుతాయి. సమాజంలో ప్రముఖులతో పరిచయాలు విస్తృతమవుతాయి. నూతన వాహన యోగం ఉన్నది. ఉద్యోగమున అధికారులతో చర్చలు ఫలిస్తాయి.

సింహం: వ్యాపార, ఉద్యోగాలలో కొంత గందరగోళ పరిస్థితులు ఉంటాయి. ప్రయాణాలు వాయిదా పడతాయి. ముఖ్యమైన వ్యవహారాలలో కొద్దిపాటి ఆటంకాలు తప్పవు. ఆర్థిక ఇబ్బందులు కొంత చికాకు పరుస్తాయి. కుటుంబ సభ్యులతో ఊహించని వివాదాలు కలుగుతాయి. చిన్నపాటి ఆరోగ్య సమస్యలు బాధిస్తాయి.

కన్య: కుటుంబ సభ్యులతో దైవదర్శనాలు చేసుకుంటారు. నూతనోత్సాహంతో కొన్ని పనులు పూర్తిచేస్తారు. వృత్తి, వ్యాపారాలు సజావుగా సాగుతాయి. నూతన గృహ వాహన యోగం ఉన్నది. సమాజంలో విశేషమైన ఆదరణ పెరుగుతుంది. ప్రముఖులతో పరిచయాలు ఉత్సాహాన్నిస్తాయి.

తుల: వ్యాపార, ఉద్యోగాలలో అనుకూల వాతావరణం ఉంటుంది. దూర ప్రయాణాలలో నూతన పరిచయాలు కలుగుతాయి. స్థిరాస్తి క్రయవిక్రయాలలో నూతన లాభాలు అందుకుంటారు. రాజకీయ ప్రముఖుల నుండి సమావేశాలలో ఆహ్వానాలు అందుతాయి. చిన్ననాటి మిత్రులతో సఖ్యతగా వ్యవహరిస్తారు.

వృశ్చికం: ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. ఉద్యోగాలలో అధికారుల నుండి ఊహించని ఇబ్బందులు ఎదురవుతాయి. చేపట్టిన పనులు మందగిస్తాయి. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉంటుంది. ఉద్యోగయత్నాలు నత్తనడకన సాగుతాయి. వ్యాపారాలు సామాన్యంగా ఉంటాయి.

ధనస్సు: వృత్తి, వ్యాపారాలలో స్థానచలన సూచనలు ఉన్నవి. చేపట్టిన పనులలో శ్రమకు తగిన ఫలితం కనిపించదు. స్వల్ప అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. నిరుద్యోగ ప్రయత్నాలు కలసి రావు. సోదరులతో ఆస్తి విషయంలో స్వల్ప వివాదాలు ఉంటాయి. ఆలయ సందర్శనం చేసుకుంటారు.

మకరం: వ్యాపారాలు విస్తరణ ప్రయత్నాలు ఫలిస్తాయి. సంఘంలో పేరు కలిగిన వ్యక్తులతో పరిచయాలు పెరుగుతాయి. ఉద్యోగాలలో పదోన్నతులు పెరుగుతాయి. విద్యార్థుల కష్టం ఫలిస్తుంది. స్థిరాస్తి కొనుగోలు ప్రయత్నాలు అనుకూలిస్తాయి. చిన్ననాటి మిత్రులను కలుసుకుంటారు.

కుంభం: వ్యాపార, ఉద్యోగాలలో సమస్యలు తొలగుతాయి. చాలా కాలంగా పూర్తికాని పనులు పూర్తి చేస్తారు. చిన్ననాటి మిత్రులతో విందువినోద కార్యక్రమాల్లో పాల్గొంటారు. దూరపు బంధువుల నుండి విలువైన సమాచారం సేకరిస్తారు. సంతాన విద్య ఉద్యోగ విషయంలో శుభవార్తలు అందుతాయి.

మీనం: పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. ముఖ్యమైన పనులు మందకొడిగా సాగుతాయి. ఉద్యోగాలలో సహోద్యోగులతో మాటపట్టింపులు ఉంటాయి. అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. వృధా ఖర్చులు విషయంలో పునరాలోచన చేయడం మంచిది. వృత్తి వ్యాపారాల్లో శ్రమ తప్ప ఫలితం కనిపించదు.

# దేశంలో ఉగ్ర కుట్ర!

మొదటి పేజీ తరువాయి

అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి వద్ద నుంచి పలు ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు.

### టెలిగ్రామ్ ద్వారా ఉగ్రసంస్థతో లింకులు

36 ఏళ్ల వయసున్న అహ్మద్ మొహియుద్దీన్ చైనాలో ఎంబీబీఎస్ చేసినట్టు పోలీసులు తెలిపారు. దేశంలో పెద్ద ఎత్తున నష్టం కలిగించే ఉగ్రదాడి చేయాలని అహ్మద్ మొహియుద్దీన్ భావిస్తున్నట్టు పోలీసులు చెప్పారు. పలువురు విదేశీయులతోనూ టచ్‌లో ఉన్నట్టు గుర్తించారు. టెలిగ్రామ్ ద్వారా ఓ ఉగ్రసంస్థతో అతడు సంబంధాలు కొనసాగిస్తున్నాడు. ఆముదం గింజలను ప్రాసెస్ చేసిన తర్వాత మిగిలిపోయిన వ్యర్థ పదార్థాల నుంచి రైసిన్ అనే విషాన్ని తయారు చేస్తున్నట్టు గుర్తించారు. గుజరాత్‌లోని కాలోల్ నుంచి ఆయుధాలు తీసుకుని మరో ప్రాంతానికి వెళ్తుండగా అహ్మద్ మొహియుద్దీన్ చిక్కినట్టు పోలీసులు చెప్పారు. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన మరో ఇద్దరు ఉగ్రవాదులను గుజరాత్‌లోని బనస్కాంతలో అరెస్టు చేశారు. ఉగ్రవాదానికి వీరు బాగా ప్రభావితమైనట్లు గుర్తించారు. వీరిద్దరు కూడా



విదేశాల్లోని పలువురితో టచ్‌లో ఉన్నట్టు పోలీసులు తెలిపారు. ఉగ్రదాడుల కోసం ఇప్పటికే దిల్లీ, అహ్మదాబాద్, లఖ్‌నవూలో రెక్కీ నిర్వహించినట్లు తెలిపారు. కశ్మీర్‌లోనూ వీరి కదలికలు నమోదైనట్లు చెప్పారు. నిందితులతో సంబంధం ఉన్న వారిని సైతం గుజరాత్ ఏటీఎస్ విచారిస్తోంది. ఈ ఏడాది ప్రారంభంలో అల్ ఖైదా ఉగ్రసంస్థతో సంబంధం ఉన్న ఐదుగురిని గుజరాత్ ఏటీఎస్ అరెస్టు చేసింది. నిందితుల్లో బెంగళూరుకు చెందిన ఓ మహిళ సైతం ఉంది. ఆన్‌లైన్ వేదికగా ఆ మహిళ టెర్రర్ మాడ్యూల్ ను నడుపుతున్నట్టు పోలీసులు గుర్తించారు. పాక్‌లోని ఉగ్రసంస్థలతో సంబంధాలున్నట్టు తెలిపారు.

### ఉగ్రవాదులకు అధికారుల సాయం

పాక్ ఉగ్రవాదులతో సంబంధాలు ఉన్నాయనే ఆరోపణలు రావడంతో జమ్మూకశ్మీర్‌లోని కథవా జిల్లాలో ఇద్దరు ఎస్పీవోలపై అధికారులు వేటు వేశారు. ఉగ్రవాదుల కార్యకలాపాలకు వీరు సాయం చేస్తున్నట్లు తేలడంతో విధుల నుంచి తొలగించామని అధికారులు పేర్కొన్నారు. ఎస్పీవోలైన అబ్దుల్ లతీఫ్, మహ్మద్ అబ్బాస్‌లపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అనంతరం దోడా జైలుకు తరలించినట్లు తెలిపారు. మరోవైపు జమ్మూకశ్మీర్‌లో వరుసగా రెండో రోజు కౌంటర్ ఇంటెలిజెన్స్ కశ్మీర్ పోలీసులు సోదాలు కొనసాగిస్తున్నారు. శనివారం 59 ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించిన పోలీసులు ఆదివారం రాంబన్, కిష్త్‌వాడ్, దోడా, కరువా, రియాసి, పూంచ్, రాజౌరి జిల్లాలు సహా 12 చోట్ల తనిఖీలు చేస్తున్నారు. జమ్మూకశ్మీర్ పోలీసులతో పాటు, సైన్యం, సీఆర్‌పీఎఫ్, ఎస్ఓజీ సిబ్బంది సోదాల్లో పాల్గొన్నారు. పలువురు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. గుర్తింపు కార్డులు, బ్యాంకు లావాదేవీలు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఉగ్రవాదంలోకి ఆకర్షించేందుకు ఓ టెర్రర్ మాడ్యుల్ చేసిన ప్రయత్నాన్ని ఇటీవల జమ్మూకశ్మీర్ పోలీసులు భగ్నం చేశారు. పలు జైళ్లలోనూ తనిఖీలు నిర్వహిస్తున్నారు. సరిహద్దుల్లో ఎత్తైన ప్రదేశాల్లో ఉండే ఉగ్రవాదులు శీతాకాలం కావడంతో మైదానా ప్రాంతాల్లో సురక్షిత ప్రదేశాల కోసం వెతుకుతున్నారని నిఘా వర్గాల ద్వారా పోలీసులకు సమాచారం అందింది. ఈ నేపథ్యంలో జమ్మూకశ్మీర్ వ్యాప్తంగా సోదాలు కొనసాగుతున్నాయి.

# మాగంటి మృతి వెనుక కుట్ర!

మొదటి పేజీ తరువాయి

చూడనివ్వలేదని మహానంద కుమారి తన ఫిర్యాదులో ఆవేదన వ్యక్తం చేశారు. కోడలు మాగంటి సునీత కుమార్తె దిషిర సూచన మేరకే ఆసుపత్రి సిబ్బంది తనను అడ్డుకున్నారని తెలిపారు. అయితే, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాత్రం ఎలాంటి అడ్డంకులు లేకుండా గోపీనాథ్‌ను కలిశారని, ఈ వివక్ష తన అనుమానాలను మరింత బలపరిచిందని ఆమె పేర్కొన్నారు. కేటీఆర్ వచ్చి వెళ్లేంత వరకు మరణవార్తను అధికారికంగా ప్రకటించలేదని, అసలు ఏం జరిగిందో కేటీఆరే చెప్పాలని ఆమె డిమాండ్ చేయడం రాజకీయ వర్గాల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది. కిడ్నీ మార్పిడి తర్వాత వైద్యులు సరైన శ్రద్ధ చూపలేదని, డయాలసిస్‌లో జాప్యం చేశారని మహానంద కుమారి ఆరోపించారు. అంతేకాకుండా గోపీనాథ్‌కు కేటాయించిన గన్‌మెన్‌లు, భద్రతా సిబ్బంది ఆయన కుప్పకూలినప్పుడు అందుబాటులో లేరని, అత్యవసర చికిత్స అందించడంలో విఫలమయ్యారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తన కోడలు సునీత, కేటీఆర్ ఇద్దరూ నిజాలు దాస్తున్నారని ఆమె తీవ్రంగా ఆరోపించారు. ఈ వ్యవహారంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ స్పందిస్తూ, గోపీనాథ్ మృతిపై పూర్తిస్థాయి విచారణ జరపాలని, దీని వెనుక ఆస్తి వివాదాలు ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేశారు. మరోవైపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా ఈ అంశంపై స్పందించారు. ఎవరైనా అధికారికంగా ఫిర్యాదు చేస్తే తప్పకుండా విచారణ జరిపిస్తామని, కన్నతల్లి ఆవేదనను తక్కువగా చూడలేమని స్పష్టం చేశారు. ఇప్పటివరకు కేవలం ఆరోపణలకే పరిమితమైన ఈ వివాదం, గోపీనాథ్ తల్లి ఫిర్యాదుతో కీలక దశకు చేరుకుంది.




# అమెరికాలో సంక్షోభం తీవ్రం

మొదటి పేజీ తరువాయి

40 విమానాశ్రయాల్లో 4 శాతం విమానాలను తగ్గించామని, మంగళవారం నుంచి ఈ సంఖ్యను మరింత పెంచి, శుక్రవారం నాటికి 10 శాతానికి చేర్చుతామని ఎఫ్ఏఏ తెలిపింది. షట్‌డౌన్ కొనసాగి, మరింత మంది ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్లు విధులకు దూరమైతే మరిన్ని కోతలు విధించాల్సి వస్తుందని రవాణా శాఖ కార్యదర్శి సీన్ డఫీ హెచ్చరించారు. ప్రభుత్వ షట్‌డౌన్ కారణంగా దాదాపు నెల రోజులుగా ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్లకు జీతాలు అందడం లేదు. దీంతో చాలామంది అనారోగ్య కారణాలు చూపి విధులకు గైర్హాజరవుతున్నారు. ఇప్పటికే ఉన్న సిబ్బంది కొరతకు ఇది తోడవడంతో విమానాల నిర్వహణ కష్టంగా మారింది. జీతాలు లేకుండానే వారానికి ఆరు రోజులు తప్పనిసరిగా ఓవర్ టైమ్ చేయాల్సి వస్తోందని, కొందరు తమ కుటుంబ ఖర్చుల కోసం రెండో ఉద్యోగం కూడా చేసుకుంటున్నారని నేషనల్ ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్స్ అసోసియేషన్ తెలిపింది. ఈ ఆకస్మిక పరిణామాలతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. "మనమందరం ప్రయాణాలు చేస్తాం. అందరికీ ఎక్కడికో ఒకచోటికి వెళ్లాల్సిన అవసరం ఉంటుంది. ప్రభుత్వం ఈ సమస్యను త్వరగా పరిష్కరిస్తుందని ఆశిస్తున్నాను" అని మియామి నుంచి డొమినికన్ రిపబ్లిక్‌కు వెళుతున్న ఎమ్మా హెూల్గిన్ అనే ప్రయాణికురాలు తన ఆవేదన వ్యక్తం చేశారు. "ప్రయాణం చేయడమే ఒత్తిడితో కూడుకున్నది. దానికి తోడు ఇలాంటి అంతరాయాలు ఏర్పడితే పరిస్థితి మరింత సవాలుగా మారుతుంది" అని ప్యూర్టోరికోకు వెళుతున్న హీథర్ జు అనే మరో ప్రయాణికురాలు అన్నారు. విమానాల రద్దు ఇలాగే కొనసాగితే థ్యాంక్స్ గివింగ్ వారం నాటికి పరిస్థితి మరింత దిగజారి, పర్యాటకం, హాలిడే షిప్పింగ్‌పై కూడా ప్రభావం చూపుతుందని హెచ్చరిస్తున్నారు.

# హైదరాబాద్ ఫైల్స్

మొదటి పేజీ తరువాయి

ఆగ్రహం వ్యక్తం చేశారు. "గ్రామీణ స్థాయి క్రికెటర్లకు అవకాశం కల్పించట్లేదని క్రీడాకారుల తల్లిదండ్రులు నన్ను కలిశారు. త్వరలో హెచ్‌సీఏపై చర్యలు ఉండబోతున్నాయి. బీసీసీఐకి కూడా ఫిర్యాదు చేస్తాం. సెలక్షన్ కమిటీలోని కొందరు రూ.లక్షలు తీసుకున్నట్లు తల్లిదండ్రులు చెప్పారు. గతంలో బాగా ఆడేవారిని కూడా ఎంపిక చేయలేదని వారు ఆరోపించారు" అని బండి సంజయ్ తెలిపారు.

# ఐటం సాంగ్‌లా కేటీఆర్ ప్రచారం

మొదటి పేజీ తరువాయి

రేవంత్ రెడ్డి.. కేసీఆర్ కట్టిన కమాండ్ కంట్రోల్ రూమ్, సచివాలయం, ప్రగతి భవన్‌లతో ఒక్క ఉద్యోగమైనా వచ్చిందా అని ప్రశ్నించారు. తాము చేసిన పనులు కేసీఆర్ చెరిపేస్తే పోయేవి కాదన్నారు. అయితే కాంగ్రెస్ ఎంత త్యాగం చేసిందో అందరికీ తెలిసిందన్నారు సీఎం రేవంత్. కాంగ్రెస్ ఇచ్చిన మాట ప్రకారమే తెలంగాణ ఏర్పడిందన్నారు. అధికారంలోకి వచ్చిన పదేళ్లలో బీఆర్ఎస్ అభివృద్ధి చేయడం పక్కన పెట్టి.. అప్పులు చేసి పోయిందన్నారు. కాళేశ్వరం కూలేశ్వరం అయిందని, డబ్బులన్నీ ఎక్కడికి పోయాయని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధి జరగలేదని.. తమకు ఈసారి అవకాశం ఇస్తే జూబ్లీహిల్స్ ప్రాంతాన్ని వందల కోట్లతో అభివృద్ధి చేసి చూపిస్తామని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. గత కాంగ్రెస్ పాలన (2004–2014)లో చేసిన అభివృద్ధిని చూసి ఓటు వేయాలని కోరారు.

## ముగిసిన ప్రచారం.. రేపే పోలింగ్

మొదటి పేజీ తరువాయి

నుంచి నవీన్ యాదవ్, బీజేపీ అభ్యర్థిగా దీపక్ రెడ్డి తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. వీరితో పాటు మొత్తం 58 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. ప్రధాన పార్టీల నేతలంతా చివరి రోజు వరకు విస్తృతంగా ప్రచారం నిర్వహించి ఓటర్లను ప్రసన్నం చేసుకునే ప్రయత్నం చేశారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం పరిధిలో మొత్తం 4,01,365 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఇందుకోసం ఎన్నికల సంఘం 407 పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేసింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా, ప్రశాంత వాతావరణంలో పోలింగ్ నిర్వహించేందుకు పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. ముఖ్యంగా 139 సమస్యాత్మక ప్రాంతాల్లో డ్రోన్లతో నిరంతర నిఘా ఏర్పాటు చేశారు. నవంబరు 11న పోలింగ్ ప్రక్రియ ముగిసిన అనంతరం, ఈ నెల 14న ఓట్ల లెక్కింపు చేపట్టి అదే రోజు ఫలితాన్ని వెల్లడిస్తారు. దీంతో అభ్యర్థుల భవితవ్యం తేలిపోనుంది.

# ఆరెస్సెస్ అభిమతం

మొదటి పేజీ తరువాయి

చేసే విధానాలకు తమ పూర్తి మద్దతు ఉంటుందని, తమ ప్రభావాన్ని ఉపయోగించి సరైన విధానాలకు అండగా నిలుస్తామని తెలిపారు. "ఉదాహరణకు, అయోధ్యలో రామ మందిరం కావాలని మేము కోరుకున్నాం. ఆ లక్ష్యం కోసం నిలబడిన వారికి మా వలంటీర్లు మద్దతు ఇచ్చారు. ఆ సమయంలో బీజేపీ ఆ ఉద్యమంలో ఉంది కాబట్టి వారికి మద్దతిచ్చాం. ఒకవేళ కాంగ్రెస్ పార్టీ రామమందిర ఉద్యమానికి మద్దతు ఇచ్చి ఉంటే, మా కార్యకర్తలు ఆ పార్టీతోనే నిలబడేవారు" అని ఆయన తేల్చిచెప్పారు. "మాకు ఏ పార్టీ సొంతం కాదు, అలాగని ఏ పార్టీ పరాయిదీ కాదు. ఎందుకంటే అవన్నీ భారతీయ పార్టీలే. మేము 'రాష్ట్ర నీతి'కి మద్దతిస్తాం, 'రాజనీతి'కి కాదు. ఈ దేశం ఏ దిశలో పయనించాలనే దానిపై మాకు ఒక దార్శనికత ఉంది. ఆ దిశగా ఎవరు పనిచేసినా వారికి మా మద్దతు ఉంటుంది" అని భగవత్ పేర్కొన్నారు. జాతీయ జెండాకు బదులుగా ఆరెస్సెస్ ఎందుకు కాషాయ జెండా (భగవా ధ్వజ్)ను ఉపయోగిస్తుందన్న ప్రశ్నకు ఆయన వివరణ ఇచ్చారు. "సంఘ్ 1925లో ప్రారంభమైంది. మాకు ఒక గురువు అవసరం. కానీ వ్యక్తిని గురువుగా స్వీకరిస్తే, వారికి పరిమిత ఆయుష్షు ఉంటుంది. అందుకే శాశ్వతంగా ఉండే మన సంస్కృతికి, హిందూత్వానికి ప్రతీకగా కాషాయ జెండాను గురువుగా స్వీకరించాం" అని తెలిపారు. జాతీయ జెండాను 1937లో ఖరారు చేశారని, దాని రూపకల్పన జరిగినప్పటి నుంచి తాము త్రివర్ణ పతాకాన్ని గౌరవిస్తూనే ఉన్నామని అన్నారు. "ప్రైవేట్ సంస్థలు జాతీయ జెండాను ఎగురవేయవచ్చని కోర్టు తీర్పు ఇచ్చిన తర్వాత, జనవరి 26, ఆగస్టు 15న అన్ని శాఖలలో జెండా వందనం చేస్తున్నాం. కమ్యూనిస్ట్ పార్టీకి ఎర్ర జెండా, కాంగ్రెస్‌కు వారి జెండా ఉన్నట్లే, మాకు కాషాయ జెండా ఉంది. ఇందులో వివాదం ఏమీ లేదు" అని స్పష్టం చేశారు. మీడియా విమర్శలపై స్పందిస్తూ, "ప్రతి ప్రశ్నకు సమాధానం ఇవ్వాల్సిన అవసరం లేదు. కొందరి పని సంఘ్ గురించి సందేహాలు రేకెత్తించడమే. వారి విమర్శల వల్లే మాకు మరింత ఆదరణ పెరుగుతోంది. నిజం తెలిసినా కొందరు విమర్శిస్తూనే ఉంటారు. మేము వాటిని పట్టించుకోకుండా దేశం కోసం మా పని మేము చేసుకుంటూ పోతాం" అని మోహన్ భగవత్ అన్నారు.

# కొండగట్టు జేఎన్టీయూలో ర్యాగింగ్!

మొదటి పేజీ తరువాయి

మొదటి సంవత్సరం చదువుతున్న ఇద్దరు అబ్బాయిలను సీనియర్లు చుట్టుముట్టి, వారికి పెళ్లి చేసినట్లుగా వివాహ తంతు నిర్వహించారు. తాళికట్టడం, ఇతర సంప్రదాయాలను అనుకరిస్తూ ఈ తంతును రికార్డు చేశారు. కొందరు సీనియర్లు ఇది కేవలం 'హెల్తీ కమ్యూనికేషన్ ఇంటరాక్షన్‌లో భాగంగా చేసిందే తప్ప వేధింపులు లేవని సమర్థించుకుంటున్నా.. ఇలాంటి చర్యలు జూనియర్ల మనస్సుపై తీవ్రమైన మానసిక ఒత్తిడిని కలిగిస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ ఘటన కేవలం సరదాగా మొదలైంది కాదని, మానసిక వేధింపుల దిశగా వెళుతోందని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సీనియర్ల ఒత్తిడి, బెదిరింపులతో జూనియర్లు భయభ్రాంతులకు గురవుతున్నట్లు సమాచారం. ఈ దారుణ ఘటనతో కళాశాల యాజమాన్యం, భద్రతా లోపాలపై అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. క్యాంపస్‌లో సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ ఇలాంటి సంఘటనలు ఆగకపోవడంపై తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులపై పర్యవేక్షణ లోపం స్పష్టంగా కనిపిస్తోందని వారు విమర్శిస్తున్నారు. కళాశాలలో యాంటీ ర్యాగింగ్, ఉమెన్ ప్రొటెక్షన్ కమిటీలు పేరుకే ఉన్నాయని.. వాటి ద్వారా అవగాహన చర్యలు కనిపించడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. ఈ కమిటీలు చట్టపరంగా అవగాహన కల్పించి.. తమ



బాధ్యతను నిర్వర్తించాలని డిమాండ్ వ్యక్తమవుతోంది. ఈ ఘటనపై కళాశాల ప్రిన్సిపాల్ నరసింహను సంప్రదించగా.. క్యాంపస్‌లో ర్యాగింగ్ జరగలేదని అన్నారు. ఫన్నీ గేమ్స్ సర్వసాధారణమని.. అయితే ఇలా పెళ్లి చేసి వీడియోలు తీయాల్సింది కాదన్నారు. ఇప్పటివరకు తమకు ఎలాంటి ఫిర్యాదులు రాలేదని, ఫిర్యాదు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. తల్లిదండ్రులు, స్థానికులు ఈ ఘటనను తేలికగా తీసుకోవద్దని యాజమాన్యాన్ని, పోలీసులను కోరుతున్నారు. ఘటన జరిగిన మరుసటి రోజు జగిత్యాల జిల్లా ఎస్పీ కాలేజీలో పర్యటించడం, అయినా ఈ విషయం ఆయన దృష్టికి రాకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులు, యాజమాన్యం కలిసి నిఘా కెమెరాలు, భద్రతా వ్యవస్థను తక్షణమే సమీక్షించాలని డిమాండ్ చేస్తున్నారు.

# 2004 -14 స్మశానాలకు స్వర్ణయుగం

**సీఎం రేవంత్ రెడ్డికి జగదీశ్ రెడ్డి కౌంటర్**



హైదరాబాద్, నవంబర్ 9 (ఈవార్తలు): 2004 నుంచి 2014 వరకు స్వర్ణ యుగమట.. కొంచెమన్న సిగ్గుండాలి రేవంత్ రెడ్డికి మాట్లాడడానికి అని మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి ధ్వజమెత్తారు. 2004 -14 దేనికి స్వర్ణయుగం? స్మశానాలకు స్వర్ణయుగం కాదా..? అని ప్రశ్నించారు. తెలంగాణ భవన్‌లో జగదీశ్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. టీడీపీ, కాంగ్రెస్ పాలనలో పాలమూరులో ఆకలి చావులు చోటు చేసుకున్నాయి. ఎకరాలు భూములు ఉన్నా వనరులు లేక అడుక్కుతింటూ చంద్రబాబు పాలనలో బస్టాండ్లలో చనిపోయారు. పాలమూరు జిల్లా నాశనం కావడానికి చంద్రబాబే కారణం కదా.. అలాంటి వారి పాలన నీకు నచ్చింది. కొంచెమన్న సోయి ఉండాలి. నల్లగొండ జిల్లాకు ఫ్లోరైడ్ తెచ్చిందెవరు..? ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల నుంచి లక్షలాది మంది దుబాయ్ ఇతర ప్రాంతాలకు వెళ్లి వలస బతుకు బతుకుతున్నది మీ పార్టీల వల్లే కదా.. సిగ్గులేని మాటలు మాట్లాడుతున్నవ్. కేసీఆర్ వచ్చిన తర్వాత ఏం జరగలేదు అని అంటున్నవ్. దేశంలో 1000 గురుకుల పాఠశాలలు ఉన్న రాష్ట్రం తెలంగాణ మాత్రమే. కార్పొరేట్ స్థాయి విద్యతో పోటీ పడి కేసీఆర్ చదువును అందించారు అని జగదీశ్ రెడ్డి గుర్తు చేశారు. ఈ రెండేండ్ల కాలంలో రేవంత్ రెడ్డి ఒక కొత్త పాఠశాల ప్రారంభించారా..? కొత్త ప్రాజెక్టును ప్రారంభం చేశారా..? హైదరాబాద్‌లో కొత్త వంతెనను ప్రారంభం చేశావా..? మేం నిర్మాణం చేసి పూర్తి చేస్తే.. ప్రారంభం చేస్తున్నవ్. అది కేసీఆర్, కేటీఆర్ నిర్మించిందని యాది చేసుకో. హైదరాబాద్ నగర అభివృద్ధి కొరకు ఇప్పటి వరకు రూ. 5 అయినా ఇచ్చావా..? హైదరాబాద్ బ్రాండ్ ఇమేజీని నీ తాతలు పెంచారా..? తెలంగాణను ప్రపంచానికి పరిచయం చేసింది కేసీఆర్, కేటీఆర్ కదా.. తప్పకుండా కేసీఆర్ పదేండ్ల పాలనకు, నీ రెండేండ్ల పాలకు రెఫరెండం అని ఒక్క సభలోనైనా చెప్పాల్సి ఉండే. కేటీఆర్ అభివృద్ధి చూసి ఓటేయమని అంటున్నారు. మరి నువ్వెందుకు అడగడం లేదు అని రేవంత్ రెడ్డిని జగదీశ్ రెడ్డి నిలదీశారు. కేసీఆర్, కేటీఆర్ చేసిన పనులు ప్రజలు చెప్పుకుంటున్నరు. చర్చించుకుంటున్నరు. సిగ్గుండాలి 24 గంటల కరెంటు ఇచ్చానని దాంతో హైదరాబాద్‌కు పెట్టుబడులు వచ్చాయి అని చెప్పడానికి. కేసీఆర్ రాక ముందు, వచ్చిన తర్వాత తెలంగాణ ఎట్ల ఉండే అని చర్చించుకోవాలి. కరెంట్ కోసం పారిశ్రామికవేత్తలు ధర్నా చేశారు కాంగ్రెస్ పాలనలో. ఇందిరా పార్కు వద్ద నువ్వు కూడా మాట్లాడావు కరెంట్ ఇవ్వకపోతే. వారానికి మూడు రోజులు కరెంట్ ఇవ్వకుండా చేసి వ్యవసాయ రంగాన్ని, పారిశ్రామిక రంగాన్ని నాశనం చేశారు. ప్రజలు వలసలు వెళ్లేలా చేశారు. ఆకలి చావులకు గురి చేశారు. చేనేత కార్మికులు మీ దుర్మార్గాల వల్లే చనిపోయారు అని జగదీశ్ రెడ్డి గుర్తు చేశారు. 60 వేల కోట్లు మిగులు బడ్జెట్తో కేసీఆర్‌కు రాష్ట్రం అప్పగించారు అంటావా? నీకు చదువు రాకపోతే తెలిసిన వాళ్ళను అడుగు. అప్పటి బడ్జెట్ కూడా అంత లేదు. కేసీఆర్ సీఎం అయ్యే నాటికే మిగులు 300 కోట్లు. దిగిపోయే నాటికి 5 వేల కోట్లు మేము మిగులు బడ్జెట్‌తో రాష్ట్రాన్ని అప్పజెప్పాం. కేసీఆర్ హయంలో ప్రపంచంలో తెలంగాణ చిత్ర పటంలోనే లేదట. ఇంతకన్నా అబద్దం మరొకటి ఉంటుందా..? ఉమ్మడి రాష్ట్రంలో 40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండేది. కేసీఆర్ ప్రయత్నాల వల్ల 2019లోనే 2 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం పండింది అని జగదీశ్ రెడ్డి వివరించారు.

## అన్ని పోలింగ్ స్టేషన్లలో వెబ్‌క్యాస్టింగ్ : ఆర్వీ కర్ణన్

హైదరాబాద్, నవంబర్ 9 (ఈవార్తలు): జూబ్లీహిల్స్‌ఉపఎన్నికకు అన్ని ఏర్పాట్లు చేశామని జిల్లా ఎన్నికల అధికారి ఆర్వీ కర్ణన్ తెలిపారు. జూబ్లీహిల్స్‌లో ఉప ఎన్నికల ప్రచారం ఆదివారం సాయంత్రంతో ముగిసింది. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి ఆర్వీ కర్ణన్ మీడియాతో మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్ ఎన్నికల బరిలో 58 మంది అభ్యర్థులు ఉన్నారని తెలిపారు. ఉప ఎన్నికలో మొత్తం 4 బ్యాలెట్ యూనిట్లు ఉంటాయని పేర్కొన్నారు. రేపు కోట్ల విజయ్ భాస్కర్ రెడ్డి స్టేడియంలో ఎన్నికల సామగ్రి పంపిణీ చేస్తామని చెప్పారు. ఎన్నికల కోసం మూడంచెల భద్రత ఏర్పాటు చేశామని అన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో మొత్తం 407 పోలింగ్‌స్టేషన్లు ఉన్నాయని అన్నారు. వీటిలో 226 పోలింగ్ స్టేషన్లు సున్నితమైనవిగా గుర్తించామని తెలిపారు. అన్ని పోలింగ్ స్టేషన్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని.. వెబ్ క్యాస్టింగ్ ఉంటుందని అన్నారు. ఈసారి కొత్తగా డ్రోన్ల ద్వారా పర్యవేక్షణ, నిఘా పెడుతున్నామని తెలిపారు. జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారం ఇవాళ సాయంత్రం 6 గంటలతో ముగిసిందని ఆర్వీ కర్ణన్ తెలిపారు. ఇంటింటి ప్రచారం మినహా ఏరకమైన ప్రచారం చేయకూడదని సూచించారు. బల్క్ మెసేజ్‌లు, సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారం నిషేధమని చెప్పారు. 11వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తామని వెల్లడించారు. ఈసారి ఓటింగ్ శాతం పెంచేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. ఓటు హక్కు ఉన్న ప్రతిఒక్కరూ తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని ఆర్వీ కర్ణన్ సూచించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక పోలింగ్‌కు భారీ భద్రత ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. పోలింగ్ విధులకు 45 ఫ్లయింగ్ స్క్వాడ్స్, 45 స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్స్ పాల్గొంటాయని తెలిపారు. ఇప్పటివరకు రూ. 3.50 కోట్ల నగదు సీజ్ చేశామని చెప్పారు.

### కుక్కల నియంత్రణకు

# రంగంలోకి జీహెచ్ఎంసీ

**తొలి రోజు ఆసుపత్రుల వద్ద 277 కుక్కల పట్టివేత**

**వాటిని స్టెరిలైజ్ చేసి జంతు సంరక్షణ కేంద్రాలకు తరలింపు**

**పాఠశాలలు, బస్టాండ్ల వద్ద కూడా డ్రైవ్ కొనసాగింపు**



హైదరాబాద్, నవంబర్ 9 (ఈవార్తలు): హైదరాబాద్ నగరంలో వీధి కుక్కల నియంత్రణకు జీహెచ్ఎంసీ ప్రత్యేక చర్యలు చేపట్టింది. సుప్రీంకోర్టు జారీ చేసిన ఆదేశాల మేరకు ప్రజలు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో కుక్కలను పట్టుకునేందుకు ప్రత్యేక డ్రైవ్‌ను ప్రారంభించింది. జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ ఆదేశాలతో వెటర్నరీ విభాగం సిబ్బంది ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. డ్రైవ్‌లో భాగంగా తొలి రోజు నగరంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల వద్ద ఏకంగా 277 వీధి కుక్కలను పట్టుకున్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. పట్టుకున్న కుక్కలకు స్టెరిలైజేషన్ (కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్స) చేసి, జంతు సంరక్షణ కేంద్రాలకు తరలిస్తామని తెలిపారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకొని ఈ డ్రైవ్‌ను నిర్వహిస్తున్నట్లు స్పష్టం చేశారు. తొలి దశలో ఆసుపత్రులు, క్రీడా ప్రాంగణాలు, రవాణా కేంద్రాలపై దృష్టి సారించినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం ఆసుపత్రుల ప్రాంగణాల్లో ఈ డ్రైవ్‌ను పూర్తి చేశామని, తదుపరి దశలో పాఠశాలలు, కళాశాలలు, బస్టాండ్‌లతో పాటు ఇతర పబ్లిక్ ప్రదేశాల్లోనూ కొనసాగిస్తామని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ వెల్లడించారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా నగరంలోని అన్ని జనసమ్మర్ద ప్రాంతాల్లో వీధి కుక్కల బెడద లేకుండా చూస్తామని ఆయన హామీ ఇచ్చారు.

## జూబ్లీహిల్స్‌లో మూతపడిన మద్యం దుకాణాలు




హైదరాబాద్, నవంబర్ 9 (ఈవార్తలు): జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. మంగళవారం (నవంబర్ 11) పోలింగ్ జరగనున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టింది. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు నియోజకవర్గ వ్యాప్తంగా ఆదివారం నుంచే కఠిన ఆంక్షలు అమల్లోకి తెచ్చింది. ఎన్నికల ప్రచారం ఆదివారంతో ముగియడంతో, అధికారులు శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా నియోజకవర్గ పరిధిలోని అన్ని మద్యం దుకాణాలను మూసివేశారు. ఆదివారం నుంచి మంగళవారం సాయంత్రం 6 గంటల వరకు వైన్ షాపులు, కల్లు దుకాణాలు, రెస్టారెంట్లు, క్లబ్బులు, స్టార్ హోటళ్లలోని బార్లు తెరుచుకోవని అధికారులు స్పష్టం చేశారు. మళ్లీ నవంబర్ 14న ఓట్ల లెక్కింపు సందర్భంగా ఆ రోజు ఉదయం నుంచి కౌంటింగ్ ప్రక్రియ ముగిసే వరకు కూడా మద్యం అమ్మకాలపై నిషేధం కొనసాగుతుందని తెలిపారు. ఎక్సైజ్ చట్టం 1968, సెక్షన్ 20 ప్రకారం ఈ ఉత్తర్వులు జారీ చేశారు. అదేవిధంగా, నియోజకవర్గంలో 144 సెక్షన్ విధించారు. దీని ప్రకారం, పోలింగ్ కేంద్రాలకు 200 మీటర్ల పరిధిలో ఐదుగురి కంటే ఎక్కువ మంది గుంపులుగా చేరడంపై నిషేధం ఉంటుంది. ఓట్ల లెక్కింపు రోజున బహిరంగ ప్రదేశాల్లో టపాసులు కాల్చడం కూడా నిబంధనలకు విరుద్ధమని అధికారులు హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ ఉప ఎన్నిక అన్ని ప్రధాన పార్టీలకు ప్రతిష్ఠాత్మకంగా మారింది. అధికార కాంగ్రెస్ పార్టీ తరపున నవీన్ యాదవ్, సిట్టింగ్ స్థానాన్ని నిలబెట్టుకునేందుకు బీఆర్ఎస్ నుంచి మాగంటి సునీత, బీజేపీ అభ్యర్థిగా లంకల దీపక్ రెడ్డి పోటీలో ఉన్నారు. నగరంలో తమ బలాన్ని చాటుకోవాలని కాంగ్రెస్, పట్టు నిలుపుకోవాలని బీఆర్ఎస్, మరింత బలపడాలని బీజేపీ తీవ్రంగా ప్రయత్నిస్తుండటంతో ఈ ఉప ఎన్నికపై రాష్ట్రవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది.

### ఎన్ని జిమ్మిక్కులు చేసినా


## కాంగ్రెస్‌కు ఓటమి: కొప్పుల ఈశ్వర్



హైదరాబాద్, నవంబర్ 9 (ఈవార్తలు): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఓటమి భయంతోనే కాంగ్రెస్ పార్టీ కపట నాటకాలు ఆడుతున్నారని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ విమర్శించారు. ప్రజల్లో వస్తున్న తీవ్ర వ్యతిరేకతను తట్టుకోలేక రకరకాల జిమ్మిక్కులు ఆడుతున్నారని అన్నారు. జూబ్లీహిల్స్‌లో ముస్లిం ఓటర్లు ఎక్కువగా ఉన్నారు కాబట్టి.. అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇచ్చి ఎన్నికల్లో గెలవాలని కుయుక్తులు చేసిందని ఆరోపించారు. కానీ ఈ ఎన్నికలో కాంగ్రెస్ పార్టీకి ఆశాభంగం తప్పదని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీ లేకపోతే ముస్లింలు లేరని ఎన్నికల ప్రచారంలో సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయని కొప్పుల ఈశ్వర్ తెలిపారు. దీనిపై ముస్లిం వర్గాల్లో తీవ్రమైన చర్చ జరుగుతుందని అన్నారు. ముఖ్యమంత్రి, మంత్రులు ఎన్నికల ప్రచారం కోసం వెళ్తుంటే ప్రజల నుంచి తీవ్ర నిరసనలు వస్తున్నాయని అన్నారు. ప్రజలకు చేసేందేమీ లేక.. చెప్పుకోవడానికి ఏమీలేక తిట్ల పురాణంతో సీఎం రేవంత్ రెడ్డి రోడ్ షోలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఎంతసేపు కేసీఆర్‌ను, బీఆర్ఎస్‌ను నిందించడం తప్ప.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత చెప్పుకునే విధంగా ఏదీ చేయలేదని విమర్శించారు. జూబ్లీహిల్స్ ఎన్నికలో కాంగ్రెస్ పార్టీకి హైడ్రా దెబ్బ తగులుతుందని కొప్పుల ఈశ్వర్ అన్నారు. ఓటమి భయంతోనే ఇప్పుడు రకరకాల జిమ్మిక్కులు చేస్తున్నారని అన్నారు. ఓటర్లను కొనే ప్రయత్నంలో భాగంగా ఒక్కో ఓటుకు రూ. 5వేలు ఇచ్చే పనిలో మంత్రులు బిజీగా ఉన్నారని అన్నారు. ఎన్ని చేసినా ఈ ఎన్నికలో కాంగ్రెస్ పార్టీకి ఓటమి తప్పదని స్పష్టం చేశారు. ఈ ఉప ఎన్నికలో బీఆర్ఎస్ పార్టీ కచ్చితంగా విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తంచేశారు.

## నేడు అజారుద్దీన్ బాధ్యతలు

హైదరాబాద్, నవంబర్ 9 (ఈవార్తలు): మంత్రిగా అజహరుద్దీన్ సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. అజహరుద్దీన్‌కు మైనారిటీల సంక్షేమం, పబ్లిక్ ఎంటర్ ప్రైజెస్ శాఖలను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన సంగతి తెలిసిందే. అజహరుద్దీన్ గత నెల 31న మంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. కాగా, పబ్లిక్ ఎంటర్ ప్రైజెస్ శాఖ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దగ్గర, మైనారిటీల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ వద్ద ఉండేది. తాజాగా అజహరుద్దీన్‌కు ఆ శాఖలను కేటాయించారు. ఇప్పుడు సీఎం రేవంత్ వద్ద హోం, విద్య, శాంతి భద్రతలు, వాణిజ్య పన్నులు, పురపాలక, సాధారణ పరిపాలన శాఖలతో పాటు ఇతర మంత్రులకు కేటాయించని శాఖలు మిగిలి ఉన్నాయి. అడ్లూరి లక్ష్మణ్ కుమార్ వద్ద ఎస్సీ, ఎస్టీ, బీసీ, వికలాంగ, వయోవృద్ధుల, ట్రాన్స్ జెండర్ల సంక్షేమ శాఖలు మిగిలాయి.



### డిసెంబర్ 12 నుంచి

## దుబాయ్‌లో తెలుగు ఐటీ మహాసభలు

హైదరాబాద్, నవంబర్ 9 (ఈవార్తలు): ప్రపంచ తెలుగు ఐటీ మహా సభలు 2025 డిసెంబర్ 12 నుంచి 14 వరకు యుఎఇలోని.. ప్రతిష్టాత్మక దుబాయ్ వరల్డ్ ట్రేడ్ సెంటర్‌లో నిర్వహించనున్నట్లు ప్రపంచ తెలుగు సమాచార సాంకేతిక మండలి (డబ్ల్యూటీఐటీసీ) అధికారికంగా ప్రకటించింది. మూడు రోజుల ఈ అంతర్జాతీయ మహా సభలు డిసెంబర్ 12న ప్రత్యేకమైన నెట్‌వర్కింగ్ ఈవెంట్ %డ% యాచ్ పార్టీతో ప్రారంభమవుతుంది. ఆ తర్వాత డిసెంబర్ 13, 14 తేదీల్లో ప్రధాన సమావేశాలు, డబ్ల్యూటీఐటీసీకు నూతన నాయకత్వం వహించేవారు ప్రమాణ స్వీకారోత్సవం జరుగుతుంది. ప్రతి రెండేళ్లకోసారి నిర్వహించబడే "ప్రపంచ తెలుగు ఐటీ మహా సభలు" ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు సాంకేతిక నిపుణులు, ఆవిష్కర్తలు, వ్యాపారవేత్తల అత్యంత ప్రాధాన్యమైన ప్రపంచ సమావేశాల్లో ఒకటిగా అవతరించింది. 2023లో సింగపూర్‌లో నిర్వహించిన గత మహాసభలో 100 దేశాలను ప్రాతినిధ్యం వహించిన 3,000 మందికి పైగా ప్రతినిధులు పాల్గొని, సాంకేతిక రంగంలో తెలుగు వృత్తిపరుల ప్రపంచంలో వివిధ దేశాల్లో జరుగుతున్న మార్పులు, అధునాతన సాంకేతికతపై పెద్ద ఎత్తున్న చర్చించారు. 2025లో దుబాయ్‌లో జరగబోయే ఈ మహా సభ విజయ వారసత్వాన్ని కొనసాగిస్తూ, 2027లో జరగబోయే తదుపరి ద్వైవార్షిక ఎడిషన్‌కు వేదికను ఏర్పాటు చేస్తుంది. ఈ కార్యక్రమం ద్వారా 100కి పైగా దేశాల నుంచి తెలుగు సాంకేతిక నిపుణులు, వ్యాపారవేత్తలు, పెట్టుబడిదారులు, ఆవిష్కర్తలు ఒక వేదికపైకి రానున్నారు. ఈ మహాసభ సందర్భంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), బ్లాక్‌చైన్, క్వాంటం కంప్యూటింగ్, సెమీకండక్టర్ డిజైన్, క్లౌడ్ టెక్నాలజీ, సైబర్ సెక్యూరిటీ, అగ్రిటెక్, ఫిన్‌టెక్, డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్ వంటి అత్యాధునిక రంగాల్లో జరుగుతున్న పురోగతులను ప్రదర్శించనున్నారు. యూఏఈ ప్రభుత్వానికి చెందిన మంత్రులు, రాజ కుటుంబ ప్రతినిధులు, విధాననిర్మాతలు అలాగే ఆసియా, యూరప్, ఉత్తర అమెరికా నుంచి వచ్చే అంతర్జాతీయ ప్రతినిధులు ఈ సదస్సులో పాల్గొననున్నారు.



## హైదరాబాద్‌ను వణికిస్తున్న చలి

హైదరాబాద్, నవంబర్ 9 (ఈవార్తలు): హైదరాబాద్‌లో చలి తీవ్రత క్రమంగా పెరుగుతోంది. గత మూడు రోజులుగా రాత్రి సమయాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోతున్నాయి. దీంతో భాగ్యనగరవాసులు చలికి వణికిపోతున్నారు. ముఖ్యంగా తెల్లవారుజామున చలిగాలుల ప్రభావం అధికంగా ఉంటోంది. వాతావరణ శాఖ అధికారుల వివరాల ప్రకారం శనివారం నగరంలో 16 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. ఇది సాధారణం కంటే తక్కువని వారు వెల్లడించారు. రాత్రి వేళల్లో చలి తీవ్రత పెరగడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం పూట కూడా మంచు ప్రభావం కనిపిస్తోంది. నగర కేంద్రంతో పోలిస్తే శివారు ప్రాంతాల్లో చలి ప్రభావం మరింత ఎక్కువగా ఉంది. పటాన్‌చెరులో అత్యల్పంగా 14 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదు కాగా, దుండిగల్‌లో 15 డిగ్రీలు, హయత్‌నగర్‌లో 17, హకీంపేటలో 17.1, రాజేంద్రనగర్‌లో 18 డిగ్రీల చొప్పున కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదైనట్లు అధికారులు తెలిపారు. రానున్న రోజుల్లో చలి మరింత పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

## హైదరాబాద్‌లో భారీగా సైబర్ మోసాలు

**రెచ్చిపోతున్న సైబర్ నేరగాళ్లు.. రోజుకి రూ.1 కోటి నష్టం**

**'జాగృత్ హైదరాబాద్ - సురక్షిత్ హైదరాబాద్' అవగాహన కార్యక్రమం ప్రారంభం**

**'సైబర్ సింబా' లోగో, క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించిన పోలీసులు**

హైదరాబాద్, నవంబర్ 9 (ఈవార్తలు): హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. ప్రజల ఆశ, భయాన్ని ఆసరాగా చేసుకుని జరుపుతున్న మోసాల కారణంగా నగరవాసులు సగటున రోజుకు రూ. 1 కోటి నష్టపోతున్నారని పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ వెల్లడించారు. ఈ నేరాలకు అడ్డుకట్ట వేసేందుకు క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించడమే లక్ష్యంగా పోలీసు శాఖ 'జాగృత్ హైదరాబాద్ %-% సురక్షిత్ హైదరాబాద్' అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఆదివారం నాడు డీజీపీ బి. శివధర్ రెడ్డితో కలిసి కమిషనర్ సజ్జనార్ ఈ కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా 'సైబర్ సింబా' లోగో, క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించి, వాలంటీర్లకు బ్యాడ్జీలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీజీపీ శివధర్ రెడ్డి మాట్లాడుతూ.. గత దశాబ్ద కాలంగా సైబర్ నేరాలు పెరుగుతున్నాయని, ఇది ఇప్పుడు ఒక తీవ్రమైన సామాజిక సమస్యగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. స్వీయ అవగాహనతోనే ఈ నేరాలను అరికట్టగలమని, అందుకే తెలంగాణ వ్యాప్తంగా యుద్ధ ప్రాతిపదికన అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించామన్నారు. "నేరగాళ్లు వ్యక్తుల సంపద, వయసు, చిరునామా వంటి వివరాలు సులభంగా సేకరించి ఫోన్ కాల్స్, సోషల్ మీడియా ద్వారా మోసాలకు పాల్పడుతున్నారు. ముఖ్యంగా ఒంటరిగా ఉండే మహిళలు, వృద్ధులు, గృహిణులను లక్ష్యంగా చేసుకుని, వారిని భయపెట్టి డబ్బులు కాజేస్తున్నారు" అని ఆయన వివరించారు. ప్రతి ఇంట్లో సైబర్ మోసాలపై అవగాహన ఉన్న ఒక్క 'సైబర్ సింబా' ఉన్నా, సమాజం మొత్తం సురక్షితంగా ఉంటుందని డీజీపీ అన్నారు. ఈ ఉద్యమంలో యువత, విశ్రాంత ఉద్యోగులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. నేరాలను నిరోధించేందుకు 'సైబర్ పెట్రోలింగ్' కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కమిషనర్ సజ్జనార్ మాట్లాడుతూ, అనుమానాస్పద కాల్స్, లింకులు, యాప్‌లను నమ్మవద్దని ప్రజలకు సూచించారు. ఓటీపీలు, పాస్‌వర్డ్‌లు, బ్యాంకు వివరాలు ఎవరితోనూ పంచుకోవద్దని హెచ్చరించారు. సోషల్ మీడియాలో అపరిచితులతో వ్యక్తిగత వివరాలు పంచుకోవద్దని, బలమైన పాస్‌వర్డ్‌లు వినియోగించాలని సలహా ఇచ్చారు. సైబర్ మోసాల బారిన పడిన బాధితులు తక్షణమే 1930 నంబర్‌కు కాల్ చేయాలని, లేదా పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని సూచించారు. అనంతరం, ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారందరితో సజ్జనార్ 'సైబర్ ప్రతిజ్ఞ' చేయించారు.




## 5 రాష్ట్రాల్లో తెలంగాణ సైబర్ బ్యూరో ఆపరేషన్

**రూ.95 కోట్లు మోసం చేసిన 81 మంది అరెస్ట్**

హైదరాబాద్, నవంబర్ 9 (ఈవార్తలు): తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన భారీ ఆపరేషన్‌ను విజయవంతంగా పూర్తి చేసింది. ఐదు రాష్ట్రాల్లో ఏకకాలంలో దాడులు నిర్వహించి, రూ. 95 కోట్ల మేర మోసాలకు పాల్పడిన 81 మంది సైబర్ నేరగాళ్లను అరెస్టు చేసింది. వీరిపై దేశవ్యాప్తంగా 754 కేసులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. తెలంగాణ పోలీసుల కథనం ప్రకారం, సైబర్ నేరగాళ్ల కదలికలపై నిఘా పెట్టిన సైబర్ సెక్యూరిటీ బ్యూరో... ఆంధ్రప్రదేశ్, కేరళ, మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో ఏకకాలంలో దాడులు చేపట్టింది. ఈ ఆపరేషన్‌లో మొత్తం 81 మందిని అదుపులోకి తీసుకుంది. అరెస్టయిన వారిలో 17 మంది ఏజెంట్లు, ఏడుగురు మహిళలు, 58 మంది మ్యూల్ ఖాతాదారులు ఉన్నారు. నిందితుల నుంచి 84 సెల్‌ఫోన్లు, 101 సిమ్ కార్డులు, 89 బ్యాంకు పాస్‌బుక్‌లు, చెక్‌బుక్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠా సభ్యుల బ్యాంకు ఖాతాల్లో ఉన్న కోట్లాది రూపాయల నగదును సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు ఫ్రీజ్ చేశారు. చట్టపరమైన ప్రక్రియ పూర్తి చేసిన తర్వాత ఈ మొత్తాన్ని బాధితులకు తిరిగి అందజేయనున్నట్లు వారు వెల్లడించారు. ఈ అరెస్టులతో దేశంలోని అనేక సైబర్ నేరాలకు అడ్డుకట్ట పడినట్లయిందని అధికారులు తెలిపారు.

## 7 గంటల పాటు అప్పలరాజు విచారణ

**శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ పోలీస్ స్టేషన్‌లో ఘటన**



కాశీబుగ్గ, నవంబర్ 9 (ఈవార్తలు): వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజును శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ పోలీసులు సుదీర్ఘంగా విచారించారు. శనివారం మధ్యాహ్నం పోలీస్ స్టేషన్‌కు హాజరైన ఆయనను దాదాపు 7 గంటల పాటు ప్రశ్నించారు. గత ఏడాది ప్రభుత్వంపై సోషల్ మీడియాలో అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలకు సంబంధించి ఈ విచారణ జరిగింది. గత ప్రభుత్వ హయాంలో అప్పలరాజు సామాజిక మాధ్యమాల్లో చేసిన కొన్ని వ్యాఖ్యలపై అప్పట్లో కేసు నమోదైంది. ఈ కేసుకు సంబంధించి విచారణకు హాజరు కావాలని పోలీసులు నిన్న ఉదయం పలాసలోని ఆయన నివాసానికి వెళ్లి నోటీసులు అందజేశారు. పోలీసుల ఆదేశాల మేరకు అప్పలరాజు మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో కాశీబుగ్గ పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. అక్కడ అధికారులు ఆయన్ను సుదీర్ఘంగా ప్రశ్నించారు. దాదాపు 7 గంటల పాటు విచారణ కొనసాగింది. పాత పోస్టులు, వాటి వెనుక ఉద్దేశాలపై పోలీసులు ఆయన్ను పలు ప్రశ్నలు అడిగినట్లు సమాచారం. విచారణ ముగిసిన అనంతరం, మళ్లీ అవసరమైనప్పుడు పిలుస్తామని, విచారణకు సహకరించాలని చెప్పి అధికారులు ఆయన్ను పంపించారు. ఈ పరిణామం స్థానిక వైసీపీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.



# బొమ్మెన విద్యార్థికి గోల్డ్ మెడల్

కథలాపూర్, నవంబర్ 9 (ఈవార్తలు): శాతవాహన విశ్వవిద్యాలయ ద్వితీయ స్నాతకోత్సవ వేడుకల్లో జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలం బొమ్మెనకు చెందిన ఊరుమల్ల రాజ్ కుమార్ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా బీఏ గోల్డ్ మోడల్ అందుకున్నారు. రాజ్ కుమార్ తండ్రి నరహరి వృత్తి రీత్యా స్వర్ణకారుడు. తనకు వచ్చే కొద్దిపాటి సంపాదనతోనే కొడుకును ప్రభుత్వ పాఠశాలలో చదివించాడు. తండ్రి ప్రోత్సాహంతో రాజ్ కుమార్ చిన్నప్పటి నుండి చదువులో చురుకుగా రాణిస్తూ 2017-2020 సంవత్సరంలో బీఏ పూర్తి చేశాడు. ఎంఏ తెలుగు, సంస్కృతంలో డబుల్ పీజీని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో పూర్తి చేశాడు. రాజ్ కుమార్ సాధించిన విజయంపై తల్లిదండ్రులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

# జగిత్యాలలో హైడ్రా ఉండాల్సింది

**అక్రమ నిర్మాణాలు కూల్చేసేది**

**మాజీమంత్రి జీవన్ రెడ్డి**



జగిత్యాల టౌన్, నవంబర్ 9 (ఈవార్తలు): హైడ్రా ఉంటే జగిత్యాలలో అక్రమ నిర్మాణాలను ఇది వరకు ఎప్పుడో కూల్చేసేదని మాజీ మంత్రి జీవన్ రెడ్డి సంచలన కామెంట్స్ చేశారు. ఆదివారం ఇందిరా భవన్ లో మీడియాతో మాట్లాడుతూ ఎమ్మెల్యే సంజయ్ కుమార్ చేసిన వ్యాఖ్యల పై రియాక్ట్ అయ్యారు. వ్యాపార వేత్త మంచాల కృష్ణ దగ్గరకు తాను రాత్రి పూట పోలేదని ఆర్యవైశ్య సంఘం మద్దతు కోసం ఆయన వద్దకు వెళ్లానని, అయితే అప్పటికే ఆయన పై రెండు సార్లు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. సర్వేనెంబర్ 138 లో 20 గుంటల స్థలాన్ని వ్యాపారవేత్త తాతలు 70 ఏళ్ల క్రితమే కొనుగోలు చేశారని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ఎలా చెబుతారని ప్రశ్నించారు. ఎమ్మెల్యే విచారణ కమిటీని ప్రభావితం చేసే మాట్లాడడం సరికాదన్నారు. హైదరాబాద్ లో హైడ్రా ద్వారా ప్రభుత్వం రూ .60 వేల కోట్ల ఆస్తులను చేజిక్కించికుందని, అదే తరహాలో జగిత్యాలలో కబ్జాకు గురైన రూ.100 కోట్ల ఆస్తిని చేజిక్కించుకోవాలన్నారు. వేములవాడలో అక్రమ నిర్మాణాలను కోర్టు ఇంజక్షన్ ఉన్నా కూల్చేశారని గతంలో కరీంనగర్ లోనూ అప్పటి కలెక్టర్ స్మితా సబర్వాల్ ఇల్లీగల్ నిర్మాణాలు తొలగించారని గుర్తు చేసారు. టైటిల్ డీడ్ లేకుండానే విలువైన భూములను అమాయకులకు అమ్మి మోసం చేశారని ఆరోపించారు. 1964 స్థల వివాదం మొదలయితే ఇప్పటి వరకు కూడా ఆక్రమణదారులు యాజమాన్య హక్కుల పై ఏ కోర్టులోనూ ప్రయత్నం చేయలేదని తెలిపారు. విలువైన భూమి అన్యాక్రాంతం కావడంలో సహకరించిన మున్సిపల్ అధికారుల పాత్ర పై ఆరా తీసి వారి పై సైతం చర్యలు తీసుకోవాల్సిందిగా డిమాండ్ చేశారు. ప్రజా ఆస్తుల పరిరక్షణలో భాగంగా తన పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

# ఎన్ని ఉన్నా ఆరోగ్యం లేకపోతే వ్యర్థం

**శంకర ఐ కేర్ భవనాన్ని**

**ప్రారంభోత్సవంలో చంద్రబాబు**




గుంటూరు, నవంబర్ 9 (ఈవార్తలు): గుంటూరు జిల్లా పెదకాకాని వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన 'శంకర ఐ సూపర్ స్పెషాలిటీ కేంద్రాన్ని' ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మానవాళికి, ముఖ్యంగా పేదలకు శంకర ఐ ఫౌండేషన్ అందిస్తున్న సేవలు అద్భుతమని, అమోఘమని ప్రశంసించారు. అవసరమైన వారికి దృష్టిని ప్రసాదిస్తూ ఆ సంస్థ చేస్తున్న కృషి వెలకట్టలేనిదని కొనియాడారు. స్వామీజీ సమక్షంలో ఈ సూపర్ స్పెషాలిటీ కేంద్రాన్ని ప్రారంభించటం తన అదృష్టంగా భావిస్తున్నానని చంద్రబాబు పేర్కొన్నారు. జగద్గురు శ్రీ ఆది శంకరాచార్యులు తమిళనాడులో స్థాపించిన కంచి పీఠం.. ధర్మం, జ్ఞానం, సేవ అనే మూడు మూల సిద్ధాంతాలపై పనిచేస్తోందని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. ఆనాటి నుంచి నేటి వరకు హిందూ ధర్మ పరిరక్షణకు కంచి పీఠం ఎంతో కృషి చేస్తోందన్నారు. హిందూ ధర్మ పరిరక్షణ కోసం ఆది శంకరాచార్యులు దేశంలోని నాలుగు ప్రాంతాల్లో నాలుగు పీఠాలను స్థాపించిన విషయాన్ని ప్రస్తావించారు. 'మానవ సేవే మాధవ సేవ' అనే సిద్ధాంతాన్ని బలంగా నమ్మే కంచి పీఠం, దేశవ్యాప్తంగా కంటి ఆసుపత్రులు స్థాపించి పేదలకు ఉచితంగా వైద్య సేవలు అందించడం గొప్ప విషయమని అన్నారు. శంకర ఐ ఫౌండేషన్ సాధించిన విజయాలను చంద్రబాబు ప్రత్యేకంగా అభినందించారు. ఐదు దశాబ్దాల ప్రస్థానంలో దేశంలోని 10 రాష్ట్రాల్లో 14 కంటి ఆసుపత్రులను నిర్మించి, విజయవంతంగా నిర్వహిస్తోందని తెలిపారు. ఇప్పటివరకు 30 లక్షల మందికి ఉచితంగా కంటి శస్త్రచికిత్సలు, 70 లక్షల మంది చిన్నారులకు కంటి పరీక్షలు చేయడం సాధారణ విషయం కాదన్నారు. ఈ ఆసుపత్రుల్లో రోజుకు సగటున 750 ఉచిత కంటి ఆపరేషన్లు జరుగుతున్నాయని తెలిసి తాను ఆశ్చర్యపోయానని, ఇది మరే ఇతర సంస్థకు సాధ్యం కాని ప్రజా సేవ అని కొనియాడారు. కేవలం భారతదేశంలోనే కాకుండా నేపాల్, కాంబోడియా, నైజీరియా వంటి దేశాల్లోనూ సేవలందిస్తుండటం ప్రశంసనీయమన్నారు. 'గిఫ్ట్ ఆఫ్ విజన్' అనే గ్రామీణ సేవా ప్రాజెక్ట్ కింద 32,000కు పైగా కంటి శిబిరాలు నిర్వహించడం వారి నిబద్ధతకు నిదర్శనమని చెప్పారు. నూతనంగా ప్రారంభించిన ఈ సూపర్ స్పెషాలిటీ ఐ కేర్ బ్లాక్‌తో మన రాష్ట్రంలో ప్రపంచ స్థాయి సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయని, దీని ద్వారా ఎంతో మంది పేదల జీవితాల్లో వెలుగులు నిండుతాయని చంద్రబాబు ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రత్యేకంగా 'రెయిన్‌బో ప్రోగ్రామ్' ద్వారా చిన్నారుల కంటి ఆరోగ్యంపై దృష్టి సారించడాన్ని ఆయన అభినందించారు. ఈ సందర్భంగా తమ ప్రభుత్వ లక్ష్యాలను కూడా చంద్రబాబు వివరించారు. 'ఆరోగ్యాంధ్రప్రదేశ్' నిర్మాణంలో భాగంగా 'హెల్తీ, వెల్తీ, హ్యాపీ ఏపీ' అనేది తమ ప్రభుత్వ విధానమని స్పష్టం చేశారు. అనారోగ్యమే నిజమైన పేదరికం అని, అందుకే ప్రజల ఆరోగ్యానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని ఉద్ఘాటించారు. ప్రజారోగ్య సంరక్షణకు వినూత్న కార్యాచరణ అమలు చేస్తున్నామని, త్వరలోనే యూనివర్సల్ హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీని తీసుకురానున్నామని ప్రకటించారు. ప్రముఖ టాటా సంస్థ సహకారంతో డిజిటల్ నెర్వ్ సెంటర్ 'సంజీవని' కేంద్రాలను త్వరలో రాష్ట్రమంతటా ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రజల ఆరోగ్యం కాపాడటానికి శంకర ఐ హాస్పిటల్స్ వంటి సంస్థల సేవలను మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నానని అన్నారు. ఇలాంటి ప్రతిష్టాత్మక సంస్థలతో కలిసి పనిచేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని, పేదలకు సేవ చేసే సంస్థలకు తమ సహకారం సంపూర్ణంగా ఉంటుందని చంద్రబాబు భరోసా ఇచ్చారు. భవిష్యత్తులో శంకర ఐ ఆస్పత్రి నిర్వహించే స్వర్ణోత్సవాల్లో తాను కూడా పాల్గొంటానని ఆయన ఆకాంక్షించారు.

# పురుగుల మందు తాగి యువకుడు సూసైడ్

తంగళ్లపల్లి, నవంబర్ 9 (ఈవార్తలు): రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం గోపాల్రావుపల్లి గ్రామానికి చెందిన ఎడ్ల వెంకటేష్ (23) యువకుడు అనారోగ్యంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ప్రస్తుతం ఎంబీఏ చదువుతున్న ఆయన.. గత 8 నెలల నుంచి పైల్స్‌తో బాధపడుతున్నాడు. రెండుసార్లు ఆపరేషన్ చేయించుకున్నా పైల్స్ నయం కాకపోవడంతో మానసికంగా బాధపడుతూ శనివారం రాత్రి గడ్డి మందు తాగాడు. హాస్పిటల్లో చేర్పించి చికిత్స చేయిస్తుండగా చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# నన్ను కాపాడండి ప్లీజ్!

**మస్కట్ నుంచి ఏపీ మహిళ కన్నీటి వేడుకోలు**

అనంతపురం, నవంబర్ 9 (ఈవార్తలు): ఉపాధి కోసం మస్కట్ వెళ్లిన అనంతపురం జిల్లాకు చెందిన మహిళ ఒకరు, యజమానులు తనను చిత్రహింసలు పెడుతున్నారని, స్వదేశానికి రప్పించాలని కన్నీటితో వేడుకుంటున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌లను సహాయం కోరుతూ ఆమె పంపిన వీడియో సందేశం తీవ్ర ఆవేదన కలిగిస్తోంది. గుంతకల్లు పట్టణానికి చెందిన జుబేదా అనే మహిళ తొమ్మిది నెలల క్రితం కడపకు చెందిన ఓ ఏజెంట్ ద్వారా ఉపాధి కోసం మస్కట్ వెళ్లారు. తొలుత షార్జా తీసుకెళ్లిన ఏజెంట్, అక్కడి నుంచి ఆమెను మస్కట్‌కు పంపించాడు. కొద్ది రోజులు బాగానే చూసుకున్నా, ఆ తర్వాత నుంచి నరకం చూపిస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. 24 గంటలూ ఇంటి పనులు చేయించుకుంటూ, అనారోగ్యంతో బాధపడుతున్నా కనికరించకుండా చిత్రహింసలు పెడుతున్నారని సెల్ఫీ వీడియోలో విలపించారు. స్వదేశానికి తిరిగి వెళ్లాలంటే రూ.2 లక్షలు చెల్లించాలని ఏజెంట్ బెదిరిస్తున్నాడని ఆమె వాపోయారు. ఈ నేపథ్యంలో, జుబేదా కుటుంబ సభ్యులు ఆమెను రక్షించాలని ప్రభుత్వ సహాయం కోరుతున్నారు. నిన్న అనంతపురం జిల్లా పర్యటనకు వచ్చిన మంత్రి నారా లోకేశ్‌ను జుబేదా సోదరి షబానా కలిశారు. తన సోదరి దీనస్థితిని వివరిస్తూ, ఆమెను సురక్షితంగా స్వదేశానికి రప్పించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. వీడియోలో జుబేదా.. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్, స్థానిక ఎమ్మెల్యే జయరామ్ పేర్లను ప్రస్తావిస్తూ, తనను ఈ నరకం నుంచి బయటపడేయాలని వేడుకోవడం పలువురిని కదిలిస్తోంది.

# ఏలూరు మెడికల్ కాలేజీ హాస్టల్‌లో ఎలుక దాడి

**నిద్రిస్తున్న ఆరుగురు విద్యార్థులను కరిచిన ఎలుక**

**బాధితులకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్ డోసులు**




ఏలూరు, నవంబర్ 9 (ఈవార్తలు): ప్రభుత్వ మెడికల్ కళాశాలలో చదువుకుంటున్న వైద్య విద్యార్థులకు ఊహించని సమస్య ఎదురైంది. ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలోని మెడికల్ కాలేజీ హాస్టల్‌లో నిద్రిస్తున్న ఆరుగురు విద్యార్థులను ఎలుక కరిచింది. ఈ ఘటనతో భయాందోళనకు గురైన విద్యార్థులు శనివారం ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి యాంటీ రేబిస్ వ్యాక్సిన్ తీసుకున్నారు. కళాశాలకు సంబంధించిన నూతన భవనాల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ క్రమంలో అక్కడున్న పొదలు, చెట్లను తొలగించడంతో వాటిలో నివసించే ఎలుకలు, ఇతర విష కీటకాలు సమీపంలోని ఆసుపత్రి, హాస్టల్ భవనాల్లోకి వస్తున్నాయి. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రిపూట నిద్రలో ఉన్నప్పుడు ఎలుకలు దాడి చేస్తుండటంతో కంటి మీద కునుకు లేకుండా పోతోందని వారు వాపోతున్నారు. గత కొంతకాలంగా ఈ సమస్య తీవ్రంగా ఉన్నప్పటికీ, సంబంధిత కాంట్రాక్టర్ పారిశుద్ధ్య చర్యలు చేపట్టడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. కీటకాల నివారణపై దృష్టి సారించడం లేదని, అయినా ఆసుపత్రి అధికారులు మాత్రం ప్రతినెలా లక్షల రూపాయల బిల్లులను మంజూరు చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. భవిష్యత్ వైద్యులకు కనీస రక్షణ కల్పించడంలో అధికార యంత్రాంగం విఫలమైందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, హాస్టల్‌లో తగిన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

# కర్పూరం వెలిగించి, హుండీలో వేసిన భక్తురాలు

**పిఠాపురం ఆలయంలో అలుముకున్న పొగలు**



పిఠాపురం, నవంబర్ 9 (ఈవార్తలు): ఓ భక్తురాలి అత్యుత్సాహం పెను ప్రమాదానికి కారణమయ్యేది. కార్తీక మాసంలో పూజలు చేసేందుకు ఆలయానికి వెళ్లిన ఓ మహిళ అతి భక్తితో కర్పూరాన్ని వెలిగించి హుండీలో వేసింది. దీంతో హుండీలో ఉన్న కరెన్సీ నోట్లకు నిప్పు అంటుకుని.. ఆలయమంతా పొగలు వ్యాపించాయి. ఆలయ సిబ్బంది వెంటనే అప్రమత్తమై మంటలు ఆర్పడంతో పెను ప్రమాదం తప్పింది. కాకినాడ జిల్లా పిఠాపురంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానం ఆలయంలో ఈ వింత ఘటన చోటుచేసుకుంది. కార్తీక మాసం శనివారం కావడంతో నిన్న పిఠాపురంలోని శృంగార వల్లభస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. కాకినాడ జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చారు. ఈ క్రమరంలో ఆలయానికి వచ్చిన ఓ మహిళ అతి భక్తితో కర్పూరం వెలిగించి, స్వామివారి హుండీలో వేసింది. దీంతో హుండీలో ఉన్న కరెన్సీ నోట్లకు నిప్పు అంటుకుంది. నోట్లు అంటుకోవడంతో కొద్దిసేపటికే హుండీ నుంచే పొగలు రావడం మొదలయ్యాయి. ఆలయంలో పొగలు అలుముకుంటూ ఉండటంతో ఆలయ సిబ్బంది గమనించారు. అప్రమత్తమైన సిబ్బంది వెంటనే హుండీలో నీళ్లు పోసి మంటలు ఆర్పివేశారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. మంటలు ఆర్పేందుకు నీళ్లు పోయడంతో హుండీ లోపల ఉన్న నోట్లు అన్నీ తడిచిపోయాయి. దీంతో ఆలయ సిబ్బంది తడిచి నోట్లను జాగ్రత్తగా పొడి బట్టతో తుడిచి ఆలయ ఆవరణలో ఎండబెట్టారు. అంతేకాకుండా హెయిర్ డ్రయ్యర్ తీసుకొచ్చి తడిచిన నోట్లను ఆరబెట్టారు. కాగా, అగ్ని ప్రమాదంలో నోట్లు చాలావరకు కాలిపోయినట్లుగా గుర్తించారు. అనంతరం అగ్ని ప్రమాదానికి కారణమైన వారిని గుర్తించేందుకు ఆలయ సిబ్బంది వెంటనే సీసీ కెమెరాలను పరిశీలించారు. ఓ భక్తురాలు హుండీలో వెలుగుతున్న కర్పూరాన్ని వేయడాన్ని వారు గుర్తించారు. కాలిపోయిన డబ్బును భక్తురాలి వద్ద నుంచి రికవరీ చేస్తామని ఆలయ అధికారులు చెబుతున్నారు.



# గుంటూరు నుంచి తిరుపతికి గుండె

**12 ఏళ్ల బాలుడికి ప్రాణదానం**

గుంటూరు, నవంబర్ 9 (ఈవార్తలు): గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న 12 ఏళ్ల బాలుడికి శనివారం రాత్రి తిరుపతిలో గుండె మార్పిడి శస్త్రచికిత్స విజయవంతంగా ప్రారంభమైంది. గుంటూరులో బ్రెయిన్‌డెడ్‌కు గురైన 35 ఏళ్ల వ్యక్తి గుండెను ప్రత్యేక ఏర్పాట్ల మధ్య తిరుపతికి తరలించారు. దాత కుటుంబ సభ్యులు తీవ్ర శోకంలో ఉన్నప్పటికీ, ఒక చిన్నారికి ప్రాణం పోయాలన్న గొప్ప మనసుతో అవయవదానానికి ముందుకు రావడం అందరినీ కదిలించింది. వివరాల్లోకి వెళితే.. గుంటూరుకు చెందిన అబ్రహం (35) రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. స్థానిక రమేష్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన బ్రెయిన్‌డెడ్‌కు గురైనట్లు వైద్యులు నిర్ధారించారు. వైద్యులు అబ్రహం కుటుంబ సభ్యులతో మాట్లాడి అవయవదానం ప్రాముఖ్యతను వివరించగా, వారు అంగీకరించారు. ఈ సమాచారాన్ని ఆస్పత్రి వర్గాలు వెంటనే జీవన్‌ధాన్‌కు తెలియజేశాయి. మరోవైపు, కర్నూలు జిల్లా నందికోట్కూరుకు చెందిన 12 ఏళ్ల బాలుడు తీవ్రమైన గుండె జబ్బుతో బాధపడుతూ, గత రెండు వారాలుగా తిరుపతిలోని శ్రీపద్మావతి హృదయాలయ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాలుడికి గుండె మార్పిడి ఒక్కటే మార్గమని వైద్యులు తేల్చి, అతని వివరాలను జీవన్‌ధాన్ పోర్టల్‌లో నమోదు చేశారు. అబ్రహం గుండె బాలుడికి సరిపోలడంతో, శ్రీపద్మావతి హృదయాలయ డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి తన బృందంతో హుటాహుటిన గుంటూరు బయల్దేరారు. అక్కడ అబ్రహం శరీరం నుంచి గుండెను జాగ్రత్తగా సేకరించిన వైద్య బృందం, అక్కడి నుంచి ప్రయాణాన్ని ఓ యజ్ఞంలా పూర్తిచేసింది. గుంటూరు నుంచి గన్నవరం విమానాశ్రయానికి గ్రీన్ ఛానల్ ద్వారా అంబులెన్సులో తరలించారు. అక్కడి నుంచి ప్రత్యేక విమానంలో శనివారం సాయంత్రం 7:50 గంటలకు బయల్దేరి, రాత్రి 9:30 గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్నారు. విమానాశ్రయం నుంచి శ్రీపద్మావతి ఆస్పత్రికి కేవలం 20 నిమిషాల్లో గ్రీన్ ఛానల్ ద్వారా రాత్రి 9:50 గంటలకు గుండెను తీసుకువచ్చారు. వెంటనే వైద్యులు ఆపరేషన్ థియేటర్‌లో బాలుడికి గుండె మార్పిడి శస్త్రచికిత్సను ప్రారంభించారు.

# ఏపీలో ఇక నుంచి ఈజీగా దర్శనం టికెట్లు



విజయవాడ, నవంబర్ 9 (ఈవార్తలు): ఏపీలోని ప్రధాన ఆలయాల్లో భక్తులకు దర్శనం సులువుగా అయ్యేందుకు కూటమి ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. దర్శనం టికెట్లను సులువుగా జారీ చేసేందుకు ముఖ్య ఆలయాల్లో కియోస్క్ మెషిన్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ప్రధాన ఆలయాల్లో టచ్ స్క్రీన్‌తో ఉన్న కియోస్క్‌లను ఏర్పాటు చేయబోతున్నారు. ఆలయాల్లో ఏర్పాటు చేసే ఈ కియోస్క్ మెషిన్ల ద్వారా భక్తులు నేరుగా దర్శనం, వివిధ సేవల టికెట్లను నేరుగా బుక్ చేసుకోవచ్చు. ఉద్యోగుల అవసరం లేకుండానే నేరుగా ఎన్ని టికెట్లు కావాలో ఎంటర్ చేసి, డిజిటల్ పేమెంట్ చేస్తే వెంటనే టికెట్లను జారీ చేస్తుంది. ఈ మేరకు ఏపీ ప్రభుత్వం అన్ని ఏర్పాట్లను చేసింది. కాగా, ఈ 100 కియోస్క్‌లను అందించేందుకు కరూర్ వైశ్య బ్యాంకు ముందుకొచ్చింది. ఈ మెషిన్ల ఇన్‌స్టాలేషన్, నిర్వహణ కూడా ఆ బ్యాంకే చూసుకుంటుందని స్పష్టం చేసింది. ఏపీలోని ప్రధాన ఆలయాలైన సింహాచలం, అన్నవరం, ద్వారకా తిరుమల, విజయవాడ కనకదుర్గమ్మ, శ్రీశైలం, కాణిపాకం, శ్రీకాళహస్తి దేవాలయాల్లో 8 చొప్పున కియోస్క్‌లను ఏర్పాటు చేస్తారు. అరసవిల్లి, విశాఖ కనకమహాలక్ష్మీ, తలుపులమ్మ, వాడపల్లి పెనుగంచిప్రోలు, మోపిదేవి, పెదకాకాని, కసాపురం ఆంజనేయ స్వామి, కదిరి లక్ష్మీనరసింహస్వామి, బోయకొండ గంగమ్మ ఆలయాల్లో మూడేసి కియోస్క్‌లు ఏర్పాటు చేయనున్నారు.

# లడ్డూ నెయ్యి కల్తీలో వైవీ పాత్ర?

**సిట్ అనుమానం.. హైకోర్టుకు కీలక నివేదిక**

తిరుమల, నవంబర్ 9 (ఈవార్తలు): తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో వాడిన నెయ్యి కల్తీ వ్యవహారంలో టీటీడీ మాజీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి పాత్ర అనుమానాస్పదంగా ఉందని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) హైకోర్టుకు స్పష్టం చేసింది. నెయ్యి సరఫరా చేసిన కంపెనీల ఉత్పత్తుల్లో కల్తీ జరిగినట్లు ప్రయోగశాల నివేదికలు స్పష్టం చేసినప్పటికీ, సుబ్బారెడ్డి వాటిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోగా, తిరిగి సరఫరాకు అనుమతించారని సిట్ తన నివేదికలో పేర్కొంది. ఈ కేసు దర్యాప్తులో భాగంగా సుబ్బారెడ్డి, ఆయన అర్ధాంగి స్వర్ణలతారెడ్డి బ్యాంకు ఖాతాల వివరాలను పరిశీలించాల్సి ఉందని, వారి పిటిషన్‌ను కొట్టివేయాలని కోర్టును కోరింది. సిట్ హైకోర్టులో దాఖలు చేసిన కౌంటర్ అఫిడవిట్ ప్రకారం, 2019-23 మధ్య సుబ్బారెడ్డి టీటీడీ ఛైర్మన్‌గా ఉన్నారు. ఆ సమయంలో ప్రీమియర్ అగ్రిఫుడ్స్, వైష్ణవి డెయిరీ, భోలేబాబా డెయిరీ సంస్థలు సరఫరా చేసిన నెయ్యి నమూనాలను మైసూరులోని సీఎఫ్‌టీఆర్ఐ ల్యాబ్‌కు పంపగా, వాటిలో వెజిటెబుల్ ఆయిల్ కలిపినట్లు 2022 ఆగస్టులో నివేదిక వచ్చింది. ఈ విషయాన్ని అధికారులు ఛైర్మన్ దృష్టికి తీసుకెళ్లినా ఆయన ఆ కంపెనీలను బ్లాక్‌లిస్టులో పెట్టకుండా, 2024 వరకు సరఫరాకు అనుమతులు ఇచ్చారని సిట్ వివరించింది. ఈ వ్యవహారంలో ఆర్థిక లావాదేవీలు కూడా జరిగినట్లు దర్యాప్తులో తేలింది. భోలేబాబా డెయిరీ డైరెక్టర్ పోమిల్ జైన్, సుబ్బారెడ్డిని కలిసి కేజీ నెయ్యికి తన పీఏ చిన్నప్పన్న రూ.25 డిమాండ్ చేస్తున్నారని ఫిర్యాదు చేశారని సిట్ పేర్కొంది. మరోవైపు ప్రీమియర్ అగ్రిఫుడ్స్ సంస్థ నుంచి సుబ్బారెడ్డి పీఏ చిన్నప్పన్న ఢిల్లీలో వేర్వేరు సందర్భాల్లో మొత్తం రూ.50 లక్షలు తీసుకున్నట్లు దర్యాప్తులో వెల్లడైందని తెలిపింది. శ్రీవారి లడ్డూ తయారీకి నకిలీ నెయ్యి సరఫరా చేసిన ఉదంతంపై సుప్రీంకోర్టు ఆదేశాలతో సీబీఐ డైరెక్టర్ పర్యవేక్షణలో సిట్ దర్యాప్తు చేస్తోంది. ఈ క్రమంలో దర్యాప్తు అధికారులు సుబ్బారెడ్డి, ఆయన అర్ధాంగి బ్యాంకు ఖాతాల వివరాలను కోరారు.

# తుపాను నష్టం అంచనాకు ఏపీకి కేంద్ర బృందం

**ఈ నెల 10, 11 తేదీల్లో ఆరు జిల్లాల్లో నష్టం అంచనా**

**కేంద్ర హెూం శాఖ సంయుక్త కార్యదర్శి పౌసమి బసు నేతృత్వం**

తాడేపల్లి, నవంబర్ 9 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల సంభవించిన తుపాను కారణంగా జరిగిన నష్టాన్ని అంచనా వేయడానికి కేంద్ర అధికారుల బృందం రాష్ట్రంలో పర్యటించనుంది. కేంద్ర హెూం శాఖ సంయుక్త కార్యదర్శి పౌసమి బసు నేతృత్వంలోని 8 మంది సభ్యుల బృందం ఈ నెల 10, 11 తేదీల్లో తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి క్షేత్రస్థాయిలో పరిస్థితిని సమీక్షించనుంది. పర్యటనలో భాగంగా కేంద్ర బృందం రెండు టీమ్‌లుగా విడిపోయి ఆరు జిల్లాల్లో నష్టాన్ని అంచనా వేస్తుంది. ఒక బృందం బాపట్ల, ప్రకాశం జిల్లాల్లో పర్యటించనుండగా, మరో బృందం కృష్ణా, ఏలూరు, తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో పరిశీలన జరపనుంది. పంట నష్టంతో పాటు ఇతర ఆస్తి నష్టాలపై కూడా అధికారులు అంచనా వేయనున్నారు. క్షేత్రస్థాయి పర్యటనకు ముందు, ఈ నెల 10వ తేదీ ఉదయం తాడేపల్లిలోని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయంలో కేంద్ర బృందం రాష్ట్ర అధికారులతో సమావేశమవుతుంది. తుపాను నష్టంపై ప్రాథమిక వివరాలు, నివేదికలను రాష్ట్ర అధికారుల నుంచి సేకరిస్తుంది. కేంద్ర బృందం పర్యటనను సమన్వయం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. నోడల్ అధికారిగా విపత్తుల నిర్వహణ సంస్థ డైరెక్టర్ ప్రఖర్ జైన్‌ను, రాష్ట్ర స్థాయి లైజనింగ్ అధికారిగా ఈడీ వెంకట దీపక్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కేంద్ర బృందం ఇచ్చే నివేదిక ఆధారంగా రాష్ట్రానికి అందే తుపాను సహాయక నిధులపై స్పష్టత రానుంది.

# బీహార్ లో ముగిసిన రెండో విడత ప్రచారం

## రేపు రెండో దశ పోలింగ్, 14న ఫలితాల వెల్లడి.. తొలి దశలో విపక్షాలకు గట్టి షాక్ తగిలిందన్న ప్రధాని మోదీ

**విపక్షాల 'జంగిల్ రాజ్' పాలనపై అమిత్ షా తీవ్ర విమర్శలు**

**ఎన్నికల కమిషన్‌పై కాంగ్రెస్ సంచలన ఆరోపణలు**

**రాహుల్ గాంధీ పర్యటనపై మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి ఎద్దేవా**



పాట్నా: దేశవ్యాప్తంగా ఉత్కంఠ రేపుతున్న బీహార్ అసెంబ్లీ ఎన్నికల ప్రచార పర్వానికి తెరపడింది. అధికార, విపక్షాల మధ్య మాటల తూటాలు పేలిన సుదీర్ఘ ప్రచారానికి శనివారంతో ముగింపు పలికారు. ఇప్పటికే నవంబర్ 6న జరిగిన తొలి దశ పోలింగ్‌లో రాష్ట్ర చరిత్రలోనే రికార్డు స్థాయిలో 65.08 శాతం ఓటింగ్ నమోదైంది. ఇక నవంబర్ 11న 122 స్థానాలకు రెండో దశ పోలింగ్ జరగనుండగా, నవంబర్ 14న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు వెల్లడించనున్నారు. బీహార్ అసెంబ్లీలో మొత్తం 243 స్థానాలు ఉన్నాయి. తొలి విడతలో 121 స్థానాలకు పోలింగ్ జరిగింది. రెండో విడత ప్రచారానికి చివరి రోజైన ఆదివారం రాజకీయ వాతావరణం మరింత వేడెక్కింది. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా విపక్షాలపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. విపక్షాల 'జంగిల్ రాజ్' పాలనను గుర్తుచేస్తూ, దేశంలోకి చొరబాటుదారులను ఏరివేస్తామని హామీ ఇచ్చారు. తొలి దశ పోలింగ్‌లోనే ప్రజలు విపక్ష 'ఇండియా' కూటమికి 65 వోల్టుల షాక్ ఇచ్చారని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. బీహార్‌లో ఎన్డీఏ ప్రభుత్వ ప్రమాణ స్వీకారానికి తాను మళ్లీ వస్తానని ఆయన ధీమా వ్యక్తం చేశారు. మరోవైపు, ఎన్డీఏ కూటమి విజయంపై చేస్తున్న ప్రచారాన్ని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కొట్టిపారేశారు. వారి వాదనల్లో ఎలాంటి పస లేదని తెలిపారు. ఇదే సమయంలో కాంగ్రెస్ నేత పవన్ ఖేరా, ఓటర్ల జాబితాలో అవకతవకలకు ఎన్నికల కమిషన్ సహకరిస్తోందంటూ సంచలన ఆరోపణలు చేశారు. ఇది రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. ఇక, బిహార్‌లో ప్రచారం ముగిసిన మరుసటి రోజే కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ బీజేపీ పాలిత రాష్ట్రమైన మధ్యప్రదేశ్‌లో పర్యటించడం విమర్శలకు దారితీసింది. బిహార్ ఎన్నికల ప్రచారం కోసం వచ్చిన మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ ఈ విషయంపై స్పందిస్తూ, రాహుల్ గాంధీ 'పిక్నిక్'లో ఉన్నారంటూ ఎద్దేవా చేశారు. కీలకమైన సమయంలో బిహార్‌కు దూరంగా ఉండటమంటే విపక్షాలు ఓటమిని అంగీకరించినట్లేనని ఆయన విమర్శించారు.

# ఇద్దరు వాంటెడ్ గ్యాంగ్‌స్టర్లు అరెస్టు

**భారత ఏజెన్సీల ఘన విజయం**

**జార్జియాలో వెంకటేశ్ గార్గ్, అమెరికాలో భాను రాణా పట్టివేత**

న్యూయార్క్: విదేశాల్లో తలదాచుకుంటూ, భారత్‌లో నేర సామ్రాజ్యాన్ని నడుపుతున్న ఇద్దరు మోస్ట్ వాంటెడ్ గ్యాంగ్‌స్టర్లను భారత భద్రతా ఏజెన్సీలు అరెస్ట్ చేశాయి. హర్యానా పోలీసులతో కలిసి చేపట్టిన ఈ భారీ ఆపరేషన్‌లో వెంకటేశ్ గార్గ్‌ను జార్జియాలో, భాను రాణాను అమెరికాలో అదుపులోకి తీసుకున్నారు. త్వరలోనే వీరిద్దరినీ భారత్‌కు రప్పించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. హర్యానాలోని నారాయణ్‌గఢ్‌కు చెందిన వెంకటేశ్ గార్గ్‌పై భారత్‌లో 10కి పైగా క్రిమినల్ కేసులు ఉన్నాయి. గురుగ్రామ్‌లో ఓ బీఎస్పీ నేత హత్య కేసులో ప్రమేయం ఉన్న తర్వాత అతడు జార్జియాకు పారిపోయాడు. అప్పటి నుంచి అక్కడే ఉంటూ హర్యానా, రాజస్థాన్, ఢిల్లీ సహా ఉత్తర భారతంలోని పలు రాష్ట్రాల యువతను తన గ్యాంగ్‌లో చేర్చుకుని నేర కార్యకలాపాలు నిర్వహిస్తున్నాడు. విదేశాల్లోనే ఉంటున్న మరో గ్యాంగ్‌స్టర్ కపిల్ సాంగ్వాన్‌తో కలిసి గార్గ్ ఓ దోపిడీ ముఠాను నడుపుతున్నట్లు అధికారులు గుర్తించారు. ఇక, అమెరికాలో పట్టుబడిన భాను రాణాకు కరుడుగట్టిన గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ ముఠాతో సంబంధాలున్నాయి. హర్యానాలోని కర్నాల్‌కు చెందిన రాణా.. చాలా కాలంగా అమెరికాలో ఉంటూ హర్యానా, పంజాబ్, ఢిల్లీలో తన నెట్‌వర్క్‌ను విస్తరించాడు. పంజాబ్‌లో జరిగిన ఓ గ్రెనేడ్ దాడి కేసు విచారణలో ఇతని పేరు బయటకు వచ్చింది. ఈ ఏడాది జూన్‌లో కర్నాల్ పోలీసులు ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేయగా, వారు భాను రాణా ఆదేశాలతోనే హ్యాండ్ గ్రెనేడ్లు, తుపాకులు కలిగి ఉన్నట్లు తేలింది. ప్రస్తుతం భారత్‌కు చెందిన రెండు డజన్లకు పైగా ప్రధాన గ్యాంగ్‌స్టర్లు విదేశాల్లో ఉంటూ, ఇక్కడ యువతను నియమించుకుని నేరాలకు పాల్పడుతున్నారని ఏజెన్సీలు చెబుతున్నాయి.

# థార్, బుల్లెట్ నడిపేవారు పోకిరీలే

**హర్యానా డీజీపీ సంచలన వ్యాఖ్యలు**

**ఆ వాహనాలను తనిఖీ చేయకుండా వదలం**



చండీగఢ్: థార్ ఎస్‌యూవీలు, బుల్లెట్ మోటార్‌సైకిళ్లు నడిపే వారి ప్రవర్తనపై హర్యానా డీజీపీ ఓపీ సింగ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. అల్లరి చేసేవారు, పోకిరీలు ఎక్కువగా ఇలాంటి వాహనాలనే వినియోగిస్తారని, అందువల్ల వాటిని చూసీచూడనట్లు వదిలేయలేమని స్పష్టం చేశారు. ఆయన వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో తీవ్ర చర్చకు దారితీశాయి. శనివారం గురుగ్రామ్‌లో విలేకరులతో మాట్లాడిన ఓపీ సింగ్ (దివంగత నటుడు సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ బావ), వాహనాల తనిఖీపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "మేము రోడ్డుపై వెళ్లే అన్ని వాహనాలను ఆపి తనిఖీ చేయం. కానీ, ఒక థార్ కారు కనిపిస్తే దాన్ని ఎలా వదిలేస్తాం? బుల్లెట్ బైక్ కనిపించినా అంతే. ఎందుకంటే సమాజంలో అల్లరిచిల్లరగా తిరిగే వాళ్లంతా ఇలాంటి వాహనాలనే వాడుతున్నారు. ఒక వ్యక్తి ఎంచుకునే వాహనం వారి మనస్తత్వాన్ని ప్రతిబింబిస్తుంది. ముఖ్యంగా థార్ నడిపేవారు రోడ్లపై స్టంట్లు చేస్తుంటారు" అని ఆయన అన్నారు. థార్ అనేది కేవలం ఒక కారు కాదని 'నేను ఇంతే' అని చాటిచెప్పే ఒక స్టేట్‌మెంట్‌గా మారిందని ఆయన అభిప్రాయపడ్డారు. ఇటీవల జరిగిన ఒక ఘటనను ఆయన ఉదాహరించారు. "ఒక అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఏసీపీ) కుమారుడు థార్ కారుతో ఒకరిని ఢీకొట్టి చంపాడు. ఇప్పుడు తన కొడుకును విడిపించాలని ఆయన కోరుతున్నారు. కానీ ఆ కారు ఎవరి పేరు మీద రిజిస్టర్ అయిందని మేము అడిగాం. అది ఆయన పేరు మీదే ఉంది. కాబట్టి అసలైన పోకిరీ ఆయనే" అని డీజీపీ ఘాటుగా వ్యాఖ్యానించారు. సొంత శాఖలోని వారిని కూడా వదలకుండా "మన పోలీసు శాఖలో ఎంతమందికి థార్ కార్లు ఉన్నాయో జాబితా తీస్తే కచ్చితంగా ఆ కారు ఉన్నవాడికి కొంచెం పిచ్చి ఉంటుంది. గూండాయిజం చేస్తూ, అదే సమయంలో పట్టుబడకూడదంటే కుదరదు. ప్రదర్శన చేయాలనుకుంటే, దాని పర్యవసానాలను కూడా ఎదుర్కోవాల్సిందే" అని హెచ్చరించారు. డీజీపీ ఓపీ సింగ్ వ్యాఖ్యలు క్షణాల్లో వైరల్ అయ్యాయి. నెటిజన్లు రెండు వర్గాలుగా విడిపోయి చర్చించుకుంటున్నారు. కొందరు డీజీపీ చెప్పింది నిజమేనని, థార్, బుల్లెట్ వాహనాలు గూండాలకు గుర్తింపుగా మారాయని సమర్థిస్తున్నారు. మరికొందరు మాత్రం ఇలా సాధారణీకరించడం సరికాదని, రోడ్ల దుస్థితి, పోలీసుల బాధ్యత గురించి ప్రశ్నిస్తున్నారు. "బుల్లెట్ బైకులు వాడి ఎన్ని నేరాలు జరిగాయి? చైన్ స్నాచింగ్‌లు, హత్యలు జరిగాయా?" అని ఒకరు ప్రశ్నించగా, "డీజీపీ చెప్పింది అక్షరాలా నిజం. వారి నిర్ణయం ప్రశంసనీయం" అని మరొకరు మద్దతు తెలిపారు. ఇటీవల గురుగ్రామ్‌లో ఒక థార్ కారు డివైడర్‌ను ఢీకొన్న ప్రమాదంలో ఆరుగురిలో ఐదుగురు మరణించిన ఘటన ఈ ఆందోళనలకు మరింత బలం చేకూరుస్తోంది. బాధితుల చేతులకు పబ్ రిస్ట్‌బ్యాండ్‌లు ఉండటంతో వారు పార్టీ నుంచి వస్తున్నట్లు పోలీసులు భావించారు. ఈ నేపథ్యంలో డీజీపీ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

# విడాకుల తర్వాత 1.70 లక్షల కోట్లు విరాళం

**దాతృత్వంలో జెఫ్ బెజోస్ మాజీ భార్య సరికొత్త రికార్డ్!**

న్యూయార్క్: ప్రపంచ కుబేరుడు, అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్ మాజీ భార్య మెకంజీ స్కాట్ తన ఉదారతతో వార్తల్లో నిలిచారు. విడాకుల తర్వాత లభించిన సంపదలో అధిక భాగాన్ని ఆమె దాతృత్వానికే కేటాయిస్తున్నారు. 2020 నుంచి ఇప్పటివరకు ఆమె ఏకంగా 19.25 బిలియన్ డాలర్లు (సుమారు రూ. 1.70 లక్షల కోట్లు) విరాళంగా అందించి రికార్డు సృష్టించారు. ఫోర్బ్స్ నివేదిక ప్రకారం మెకంజీ స్కాట్ తన 'యీల్డ్ గివింగ్' అనే దాతృత్వ సంస్థ ద్వారా ఈ భారీ విరాళాలను అందిస్తున్నారు. విద్య, విపత్తు నిర్వహణ, ఇతర సామాజిక అంశాలపై పనిచేస్తున్న అనేక స్వచ్ఛంద సంస్థలకు ఆమె ఆర్థిక చేయూతనిస్తున్నారు. ముఖ్యంగా ఆమె ఇచ్చే నిధులు 'అన్‌రిస్ట్రిక్టెడ్ గ్రాంట్స్' కావడంతో ఆయా సంస్థలు తమ అవసరాలకు అనుగుణంగా ఆ డబ్బును స్వేచ్ఛగా వినియోగించుకునే అవకాశం ఉంటుంది. 2019లో జెఫ్ బెజోస్‌తో విడాకులు తీసుకున్న సమయంలో అమెజాన్ కంపెనీలో ఆమెకు 4 శాతం వాటా లభించింది. దీని విలువ దాదాపు 139 మిలియన్ షేర్లు. అప్పటి నుంచి తన వాటాను క్రమంగా విక్రయిస్తూ వస్తున్న మెకంజీ, ఆ వచ్చిన డబ్బును పూర్తిగా దానధర్మాలకే కేటాయిస్తున్నారు. ఇప్పటివరకు తన వాటాలో 42 శాతం అంటే దాదాపు 58 మిలియన్ షేర్లను ఆమె విక్రయించారు. ఇంత భారీ మొత్తంలో నిరంతరం విరాళాలు అందిస్తున్నప్పటికీ, మెకంజీ స్కాట్ నికర ఆస్తుల విలువ ఇంకా 35.6 బిలియన్ డాలర్లు (సుమారు రూ. 3.15 లక్షల కోట్లు)గా ఉంది. సంపదను సమాజ హితం కోసం వెచ్చించడంలో ఆమె ప్రపంచవ్యాప్తంగా ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్నారు.

# జపాన్‌లో ఎలుగుబంట్ల బెడద

**సైన్యాన్ని రంగంలోకి దించిన ప్రభుత్వం**



టోక్యో: జపాన్ లో ఇటీవలి కాలంలో ఎలుగుబంట్ల సంతతి విపరీతంగా పెరిగిపోతోంది. ముఖ్యంగా అకిటా రాష్ట్రంలో వీటి సంఖ్య బాగా పెరిగింది. దీంతో అడవుల్లో ఉండాల్సిన ఎలుగుబంట్లు ఆహారం కోసం తరచూ జనావాసాల్లోకి వస్తున్నాయి. ఈ క్రమంలో మనుషులపై దాడి చేయడం సాధారణంగా మారిపోయింది. గడిచిన ఆరు నెలల్లోనే వందకు పైగా దాడులు చోటుచేసుకున్నాయి. పలువురు ప్రాణాలు కోల్పోయారు. దీంతో జనం భయాందోళనకు గురవుతుండడంతో ప్రభుత్వం స్పందించింది. ఎలుగుబంట్లను పట్టుకునేందుకు, జనావాసాల్లోకి రాకుండా వాటిని అడ్డుకోవడానికి సైన్యాన్ని రంగంలోకి దించింది. వాతావరణ మార్పులతో ఆహార వనరుల కొరత, శీతాకాలంలోనూ వెచ్చని ఉష్ణోగ్రతలతో హైబర్‌నేషన్ (సుప్తావస్థ) ఆలస్యం కావడంతో భల్లూకాలు జనావాసాల్లోకి వస్తున్నట్లు తెలుస్తోంది. గ్రామీణ ప్రాంతాల ప్రజలు పట్టణాలకు వెళ్లడంతో అక్కడ పండ్ల చెట్లు, ఇతర చెట్లు విపరీతంగా పెరగడం కూడా వీటి సంచారం పెరుగుదలకు కారణంగా నిపుణులు చెబుతున్నారు. కజనో పట్టణంలో ఎలుగుబంట్ల సంచారం ఇటీవల విపరీతంగా పెరిగింది. రైల్వే స్టేషన్లు, రిసార్టులు, సూపర్ మార్కెట్లతోపాటు పాఠశాలల్లోనూ నిత్యం తిరుగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఏప్రిల్ నుంచి ఎలుగుబంట్ల దాడుల్లో 13 మంది చనిపోయారని, దాదాపు వంద మందికి పైగా గాయపడ్డారని అధికారులు తెలిపారు. ఎలుగుబంట్లను పట్టుకోవడానికి ప్రభుత్వం ప్రత్యేక ఆపరేషన్ చేపట్టింది. వాటిని బంధించడానికి వేటగాళ్లతో పాటు సైన్యాన్ని రంగంలోకి దించింది. ఎలుగుబంట్లను బంధించేందుకు బోన్లను, వాటి కళేబరాలు తరలించడంలో సైనికులు సాయపడతారని రక్షణ శాఖ వెల్లడించింది. అయితే, వాటిని చంపేందుకు తుపాకులు మాత్రం ఉపయోగించరని స్పష్టం చేసింది. అకిటా, ఇవాటే ప్రావిన్సుల్లో ఎలుగుబంట్లపై కాల్పులు జరిపేందుకు ప్రభుత్వం సైన్యానికి అనుమతిచ్చింది. వేటగాళ్లు సరైన సమయంలో స్పందించలేని పరిస్థితుల్లో మాత్రమే కాల్పులు జరపాలని ఆదేశించింది. మరోవైపు, గిఫు ప్రావిన్సులో డ్రోన్ల సాయంతో వివిధ శబ్దాలను సృష్టిస్తూ ఎలుగుబంట్లను భయపెడుతున్నారు. అక్రమంగా వేటాడడం వల్ల గతంలో ఎలుగుబంట్ల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. దీంతో అప్రమత్తమైన ప్రభుత్వం ఎలుగుబంట్లను పరిరక్షించేందుకు 1990లలో ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఆ తర్వాత నుంచి వీటి సంఖ్య పెరుగుతూ వస్తోంది. ప్రస్తుతం ఒక్క హొన్షూ ద్వీపంలోనే ఏకంగా 42 వేల ఎలుగుబంట్లు ఉన్నట్లు సమాచారం. హొక్కైడో ద్వీపంలో ప్రస్తుతం 12 వేల వరకు ఎలుగుబంట్లు ఉన్నట్లు అంచనా.



# అది ప్రభుత్వ భూమి అని తెలియదు

**పూణె భూ వివాదంపై అజిత్ పవార్**

డీల్ రద్దు చేయాలన్నా 42 కోట్లు చెల్లించాల్సిందే!

పూణే: మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ కుమారుడు పార్థ్ పవార్ కు చెందిన కంపెనీ పూణెలో కొనుగోలు చేసిన భూమిపై వివాదం రేగిన విషయం తెలిసిందే. సుమారు రూ.1800 కోట్ల విలువైన భూమిని రూ.300 కోట్లకే సొంతం చేసుకున్నారని, ఈ డీల్ కు సంబంధించి స్టాంప్ డ్యూటీ నుంచి మినహాయింపు కూడా పొందారని ఆరోపణలు వెల్లువెత్తాయి. దీంతో మహారాష్ట్ర ప్రభుత్వం ఇరకాటంలో పడింది. ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ దీనిపై వివరణ ఇస్తూ.. అది ప్రభుత్వ భూమి అనే విషయం తన కుమారుడికి తెలియదని చెప్పారు. భూమి కొనుగోలుకు సంబంధించిన డీల్ ను రద్దు చేసుకుంటున్నట్లు ప్రకటించారు. అయితే, ఈ డీల్ రద్దు చేయడానికీ పార్థ్ పవార్ కంపెనీ భారీగానే చెల్లించాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ల్యాండ్ కొనుగోలుకు సంబంధించిన ఒప్పందాన్ని రద్దు చేయాలంటే పార్థ్ పవార్ కంపెనీ రూ.42 కోట్లు చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. పూణేలోని ముంధ్వా ప్రాంతంలో ఉన్న సుమారు 40 ఎకరాల ప్రభుత్వ భూమి (మహర్ వతన్ భూమి) ని అజిత్ పవార్ కుమారుడు పార్థ్ పవార్ కు చెందిన కంపెనీ కొనుగోలు చేసింది. మార్కెట్ విలువ ప్రకారం ఈ భూమి విలువ దాదాపు రూ.1800 కోట్లు. పార్థ్ కంపెనీ మాత్రం దీనిని రూ.300 కోట్లకే సొంతం చేసుకుంది. నిజానికి 'మహర్ వతన్' భూమి ప్రభుత్వ ఆస్తి, ప్రభుత్వ అనుమతి లేకుండా ఈ భూములను అమ్మడం లేదా కొనడం సాధ్యం కాదు. దీంతో పార్థ్ కంపెనీ అక్రమాలకు పాల్పడిందని, విలువైన ప్రభుత్వ భూమిని కాజేసిందని ఆరోపణలు వెల్లువెత్తాయి.

# ట్రంప్ వల్లే యుద్ధం ఆగింది

**మరోసారి ప్రశంసించిన పాక్ ప్రధాని**

ఇస్లామాబాద్: భారత్, పాకిస్థాన్ మధ్య గత మే నెలలో తలెత్తిన తీవ్ర ఉద్రిక్తతలను చల్లార్చి, యుద్ధాన్ని నివారించింది అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంపేనని పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ మరోసారి ప్రశంసించారు. ఆయన 'ధైర్యవంతమైన, నిర్ణయాత్మక నాయకత్వం' వల్లే కాల్పుల విరమణ సాధ్యమైందని కొనియాడారు. శనివారం అజర్‌బైజాన్ రాజధాని బాకులో జరిగిన 'విక్టరీ డే' పరేడ్‌లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. తన ప్రసంగంలో షెహబాజ్ మాట్లాడుతూ "ట్రంప్ జోక్యంతో దక్షిణాసియాలో శాంతి పునరుద్ధరించబడింది. ఒక పెద్ద యుద్ధం నివారించబడింది, తద్వారా లక్షలాది మంది ప్రాణాలు నిలిచాయి" అని పేర్కొన్నారు. వాషింగ్టన్ మధ్యవర్తిత్వంతో జరిగిన చర్చల అనంతరం మే 10న ఇరు దేశాలు 'పూర్తి, తక్షణ కాల్పుల విరమణ'కు అంగీకరించినట్లు ట్రంప్ అప్పట్లో ప్రకటించిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి పాకిస్థాన్ ఈ ఘనతను ట్రంప్‌కు ఆపాదిస్తుండగా, భారత్ మాత్రం ఈ విషయంలో ఏ మూడో వ్యక్తి ప్రమేయం లేదని, నాలుగు రోజుల పాటు సరిహద్దుల్లో డ్రోన్లు, క్షిపణులతో దాడులు జరిగిన అనంతరం ఇరు దేశాలు ద్వైపాక్షిక చర్చల ద్వారానే ఒక అవగాహనకు వచ్చాయని న్యూఢిల్లీ మొదటి నుంచి స్పష్టం చేస్తోంది. ఇదే కార్యక్రమంలో షెహబాజ్ షరీఫ్ కశ్మీర్ అంశాన్ని కూడా ప్రస్తావించారు. కరబాఖ్‌లో అజర్‌బైజాన్ సాధించిన విజయం "కశ్మీర్ వంటి అణచివేతకు గురైన అన్ని దేశాలకు ఆశాకిరణం" అని ఆయన అభివర్ణించారు. పాకిస్థాన్ శాంతిని కోరుకుంటుందని, అయితే తమ సార్వభౌమత్వం, ప్రాదేశిక సమగ్రత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడబోదని తేల్చిచెప్పారు. ఈ విక్టరీ డే పరేడ్‌లో అజర్‌బైజాన్ సైనిక దళాలతో పాటు పాకిస్థాన్, తుర్కియే సైనికులు కూడా కవాతు నిర్వహించారు.

# కిమ్ కర్దాషియాన్... మళ్లీ ఫెయిలైంది!

**బార్ ఎగ్జామ్‌లో ఫెయిల్ అయిన హాలీవుడ్ నటి**

**న్యాయవాది అయ్యేంతవరకు ప్రయత్నిస్తానని వెల్లడి**



న్యూయార్క్: ప్రముఖ రియాలిటీ టీవీ స్టార్, వ్యాపారవేత్త కిమ్ కర్దాషియాన్ లాయర్ కావాలన్న తన కలను నెరవేర్చుకునే ప్రయత్నంలో మరోసారి విఫలమైంది. కాలిఫోర్నియా బార్ ఎగ్జామ్‌లో ఆమె ఉత్తీర్ణత సాధించలేకపోయింది. అయితే, ఈ ఫలితంతో తాను నిరాశ పడలేదని, న్యాయవాది అయ్యే వరకు తన ప్రయత్నాన్ని ఆపనని స్పష్టం చేసింది. ఇది ఓటమి కాదని, తన పట్టుదలకు మరింత ఇంధనం లాంటిదని సోషల్ మీడియాలో పేర్కొంది. ఈ ఏడాది జులైలో బార్ పరీక్ష రాసిన కిమ్, దాని ఫలితంపై తాజాగా తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో స్పందించింది. "సరే... నేను ఇంకా అడ్వొకేట్ కాలేదు. కేవలం టీవీలో మంచి దుస్తులు వేసుకున్న న్యాయవాదిగా నటిస్తున్నానంతే" అని ఆమె చమత్కరించింది. "ఈ న్యాయవాద ప్రయాణంలో ఆరేళ్లు గడిచాయి. బార్ పరీక్ష పాసయ్యే వరకు నేను వెనక్కి తగ్గేది లేదు. ఎలాంటి షార్ట్‌కట్స్ ఉండవు. మరింత చదువు, మరింత పట్టుదలే నా ముందున్న మార్గం" అని 45 ఏళ్ల కిమ్ వివరించింది. న్యాయవాది కావాలన్న తన ఆకాంక్షను కిమ్ 2019లో ప్రకటించింది. సంప్రదాయ కాలేజీ విద్యకు బదులుగా, ఆమె ఓ లా ఫర్మ్‌లో అప్రెంటిస్‌గా చేరి న్యాయశాస్త్రం అభ్యసిస్తోంది. గతంలో 'బేబీ బార్'గా పిలిచే ఫస్ట్-ఇయర్ లా స్టూడెంట్స్ ఎగ్జామినేషన్‌ను కూడా ఆమె నాలుగు ప్రయత్నాల్లో పాసైంది. ఈ ఏడాది మల్టీస్టేట్ ప్రొఫెషనల్ రెస్పాన్సిబిలిటీ ఎగ్జామ్‌లోనూ ఆమె ఉత్తీర్ణత సాధించింది. ఇదిలా ఉండగా, కిమ్ కర్దాషియాన్ ప్రస్తుతం 'ఆల్స్ ఫెయిర్' అనే వెబ్ సిరీస్‌లో నటిస్తోంది. ఇందులో ఆమె ఓ మహిళా న్యాయవాదుల సంస్థలో పనిచేసే లాయర్ పాత్ర పోషిస్తుండటం గమనార్హం. తనకు మద్దతుగా నిలుస్తున్న ప్రతి ఒక్కరికీ ఆమె కృతజ్ఞతలు తెలిపింది. పాస్ అవడానికి చాలా దగ్గరగా వచ్చి విఫలమవడం తనను మరింత ప్రేరేపించిందని, త్వరలోనే విజయం సాధిస్తానని కిమ్ ధీమా వ్యక్తం చేసింది.



# జపాన్ లో 6.7 తీవ్రతతో భారీ భూకంపం

**సునామీ హెచ్చరికలు జారీ.. కొన్ని ప్రాంతాల్లో ఎగిసిన సునామీ అలలు**

**నిలిచిపోయిన బుల్లెట్ రైలు సర్వీసులు**

టోక్యో: జపాన్‌లో ఆదివారం భారీ భూకంపం సంభవించింది. దేశ ఈశాన్య ప్రాంతంలోని పసిఫిక్ మహాసముద్రంలో రిక్టర్ స్కేలుపై 6.7 తీవ్రతతో భూమి కంపించడంతో అధికారులు సునామీ హెచ్చరికలు జారీ చేశారు. ఈ భూకంపం కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడగా, బుల్లెట్ రైలు సర్వీసులు తాత్కాలికంగా నిలిచిపోయాయి. జపాన్ వాతావరణ సంస్థ వెల్లడించిన వివరాల ప్రకారం, స్థానిక కాలమానం ప్రకారం సాయంత్రం 5:03 గంటలకు సంరికు తీరానికి సమీపంలో, సముద్ర గర్భంలో 10 కిలోమీటర్ల లోతున భూకంప కేంద్రాన్ని గుర్తించారు. భూకంపం కారణంగా ఇవాతె రాష్ట్ర తీరాన్నిమీటరు ఎత్తు వరకు సునామీ అలలు తాకే ప్రమాదం ఉందని వాతావరణ సంస్థ హెచ్చరించింది. ఒఫునాటోలో 10 సెంటీమీటర్ల ఎత్తున, మియాకోలో ఓ మోస్తరు అలలు తీరాన్ని తాకినట్లు అధికారులు తెలిపారు. భూకంపం కారణంగా తాత్కాలికంగా నిలిపివేసిన తొహొకు షింకన్‌సెన్ బుల్లెట్ రైలు సర్వీసులను కొద్దిసేపటికే పునరుద్ధరించినట్లు ఆపరేటర్ జేఆర్ ఈస్ట్ ప్రకటించింది. ఈ ఘటనపై జపాన్ ప్రధాని సనాయె తకైచి 'ఎక్స్' వేదికగా స్పందించారు. "సునామీ హెచ్చరిక జారీ చేయబడింది, కాబట్టి దయచేసి వెంటనే తీరం నుంచి దూరంగా సురక్షిత ప్రాంతాలకు వెళ్లండి. ఊహించిన దాని కంటే పెద్ద సునామీ రావచ్చు, కాబట్టి తదుపరి సమాచారం కోసం అప్రమత్తంగా ఉండండి. భూకంపం తర్వాత కూడా ప్రకంపనలు వచ్చే అవకాశం ఉంది" అని ఆమె ప్రజలను హెచ్చరించారు. మియాగి రాష్ట్రంలోని ఒనగావా అణు విద్యుత్ కేంద్రంలో ఎలాంటి నష్టం నమోదు కాలేదని, ప్లాంట్‌కు ఎటువంటి ప్రమాదం లేదని తొహొకు ఎలక్ట్రిక్ పవర్ సంస్థ స్పష్టం చేసింది. అయితే, రానున్న కొద్ది రోజుల్లో ఇదే తీవ్రతతో లేదా అంతకంటే శక్తివంతమైన భూకంపాలు సంభవించే ప్రమాదం ఉందని, సునామీ హెచ్చరికలున్న ప్రాంతాల్లో ప్రజలు సముద్ర తీరానికి వెళ్లవద్దని వాతావరణ సంస్థ అధికారి ఒకరు మీడియా సమావేశంలో సూచించారు.

# బ్రిడ్జి కట్టే వరకు ఓటు వేయం

**77 ఏళ్లుగా మూడు గ్రామాల నిరసన**

**మోర్వార్ నదిపై బ్రిడ్జి నిర్మించాలని డిమాండ్**

పాట్నా: బీహార్‌లో జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల్లో అభివృద్ధి, మహిళా సంక్షేమం, యువత ప్రధాన ప్రచారాస్త్రాలుగా మారాయి. కానీ, గయకు సుమారు 150 కిలోమీటర్ల దూరంలోని కొన్ని గ్రామాలకు మాత్రం అభివృద్ధి అనేది 77 ఏళ్లుగా అందని ద్రాక్షగానే మిగిలిపోయింది. తమ దశాబ్దాల డిమాండ్‌ను నెరవేర్చని పాలకులపై వారు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. మోర్వార్ నదిపై వంతెన నిర్మించే వరకు ఓటు వేసే ప్రసక్తే లేదని తేల్చిచెబుతున్నారు. పత్రా, హెర్వాంజ్, కేవల్‌డిహ్ అనే మూడు గ్రామాలకు చెందిన సుమారు 8,000 మంది ప్రజలు తరతరాలుగా ఒకే ఒక్క కోరిక కోసం ఎదురుచూస్తున్నారు. తమ గ్రామాలను బాహ్య ప్రపంచంతో కలిపే మోర్వార్ నదిపై ఒక వంతెన నిర్మించాలన్నదే వారి డిమాండ్. ఆ నదిని వారు "నిస్సహాయ నది"గా పిలుచుకుంటున్నారు. "బ్రిడ్జి కట్టేంత వరకు ఓటు వేయం. 'పుల్ నహీ తో వోట్ నహీ' (వంతెన లేకుంటే ఓటు లేదు)" అని ఓ మహిళా ఓటరు స్పష్టం చేశారు. "77 ఏళ్లుగా అందరూ ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. నాయకులు వస్తుంటారు, పోతుంటారు కానీ హామీలు మాత్రం నెరవేర్చరు. వర్షాకాలంలో నదిలో నీటి మట్టం భుజాల వరకు వస్తుంది. మాకు అభివృద్ధి అంటే ఈ వంతెన నిర్మాణమే" అని ఆమె తెలిపారు. ప్రతి ఏటా వర్షాకాలంలో దాదాపు నాలుగు నెలల పాటు ఈ గ్రామాలు రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలతో పూర్తిగా సంబంధాలు కోల్పోతాయి. నిత్యావసరాల కోసం మార్కెట్‌కు వెళ్లాలన్నా, పిల్లలు బడికి వెళ్లాలన్నా, రైతులు తమ పంటను అమ్ముకోవాలన్నా ప్రాణాల మీద ఆశ వదులుకుని నదిని దాటాల్సిందే. అత్యవసర వైద్యం కోసం ఆసుపత్రికి వెళ్లడం వీలుకాక ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఇటీవల పత్రా గ్రామానికి చెందిన సునీల్ విశ్వకర్మ అనే వ్యక్తికి అనారోగ్యం పాలవగా, నది దాటలేక సరైన సమయంలో వైద్యం అందక నది ఒడ్డునే ప్రాణాలు విడిచాడు. "నది వల్లే వాడిని ఆసుపత్రికి తీసుకెళ్లలేకపోయాం. అంబులెన్స్ రాలేదు. ప్రైవేట్ వాహనం మాట్లాడితే అది నదికి అవతలి వైపు ఉండిపోయింది" అని విశ్వకర్మ తల్లి కన్నీరు పెట్టుకున్నారు. గర్భిణులు 39 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆసుపత్రికి వెళ్లేలోపే మార్గమధ్యంలో మరణించిన సందర్భాలు అనేకం ఉన్నాయి.

వయ్యారి చిత్రం


మేఘా శుక్లా




## 12న ఆంధ్ర కింగ్ తాలూకా 'ఫస్ట్‌డే' సాంగ్!

టాలీవుడ్ యంగ్ అండ్ టాలెంటెడ్ హీరోస్ లో ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని కూడా ఒకరు. మరి రామ్ హీరోగా భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్ గా దర్శకుడు మహేష్ బాబు తెరకెక్కిస్తున్న చిత్రం ఆంధ్ర కింగ్ తాలూకా కోసం అందరికీ తెలిసిందే. ఈ సినిమా నుంచి వచ్చిన ప్రతీ సాంగ్ సూపర్ హిట్ టాక్ ని సొంతం చేసుకున్నాయి. అయితే ఇక ఈ సినిమా ఫస్ట్ డే ఫస్ట్ షోకి సిద్ధం అయ్యింది. ఇది ఆ ఫస్ట్ డే ఫస్ట్ షో కాదు. ఇది కూడా ఒక సాంగ్. దీనికి మేకర్స్ డేట్ ఇచ్చేసారు. ఈ సాంగ్ ని ఈ నవంబర్ 12న విడుదల చేస్తున్నట్టుగా కన్ఫర్మ్ చేశారు. సంగీత దర్శకులు వివేక్ %-% మెర్విన్ ల వర్క్ కి ఆల్రెడీ మంచి రెస్పాన్స్ వచ్చింది. ఇక ఈ సాంగ్ కి ఎలాంటి రెస్పాన్స్ వస్తుందో చూడాలి. ఇక ఈ సినిమాని మైత్రి మూవీ మేకర్స్ నిర్మాణం వహిస్తుండగా ఈ నవంబర్ 28న థియేటర్స్ లో గ్రాండ్ గా రిలీజ్ కి రాబోతుంది.



## దేవర-2 షూట్ కోసం రెడీ

ఎన్టీఆర్ హీరోగా నటించిన 'దేవర' సినిమాకు భారీ కలెక్షన్స్ వచ్చాయి. అటు ఓటీటీలో కూడా అద్భుతంగా అదరగొట్టింది. ఈ నేపథ్యంలో సీక్వెల్ పై భారీ అంచనాలు నెలకొన్నాయి. పైగా 'దేవర పార్ట్-2' జనవరి ఎండింగ్ నుంచి షూట్ స్టార్ట్ కాబోతుందని తెలుస్తోంది. ఈ క్రమంలో కొరటాల శివ 'దేవర పార్ట్-2' కథలో చాలా మార్పులు చేసి షూట్ కోసం కసరత్తులు చేస్తున్నారట. ముఖ్యంగా నార్త్ ఇండియా ప్రేక్షకులను ఆకట్టుకోవడానికి ప్రత్యేకంగా జాగ్రత్తలు తీసుకున్నారట. ఇందులో భాగంగా మరో బాలీవుడ్ హీరో ఈ సినిమాలో నటిస్తాడని తెలుస్తోంది. అదేవిధంగా 'దేవర 2'లో మరో హీరోయిన్ కనిపిస్తోందని తెలుస్తోంది. కాగా ఈ మూవీలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటించారు. సైఫ్ అలీ ఖాన్ విలన్ పాత్ర పోషించారు. అనిరుధ్ మ్యూజిక్ అందించారు. అలాగే, ఈ చిత్రంలో శ్రీకాంత్, ప్రకాష్ రాజ్, అజయ్, మురళీ శర్మ ఇతర కీలక పాత్రల్లో నటించారు. మొత్తానికి ఈ సీక్వెల్ పై భారీ అంచనాలు ఉన్నాయి. మరి ఆ అంచనాలను ఈ సీక్వెల్ ఏ రేంజ్ లో ఆకట్టుకుంటుందో చూడాలి.



## చిరుకు ఆర్జీవీ క్షమాపణలు

దర్శకుడు రామ్ గోపాల్ వర్మ అంటేనే.. వివాదానికి కేంద్ర బిందువు. తన గురించి ఎవరు ఏమనుకుంటారో ?, తన పోస్ట్ ల పై ఎదుటి వ్యక్తులు ఎలా ఫీల్ అవుతారో ? లాంటి వాటి గురించి వర్మ అస్సలు ఆలోచించడు. వర్మ అంటేనే కాంట్రవర్సీ. అయితే, అలాంటి వర్మ ప్రస్తుతం క్షమాపణలు కోరడం విశేషం. తన తొలి సినిమా 'శివ' రీ రిలీజ్ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన చిరంజీవికి థాంక్స్ చెప్పడంతోపాటు క్షమాపణలు కూడా చెప్పాడు. ఇంతకీ, రామ్‌గోపాల్ వర్మ ఏం పోస్ట్ పెట్టాడు అంటే.. 'థాంక్స్ చిరంజీవి గారు. అనుకోకుండా మిమ్మల్ని ఇబ్బంది పెట్టి ఉంటే ఈ సందర్భంగా క్షమాపణలు కోరుతున్నాను. మీ విశాల హృదయంతో మా టీమ్‌ని విష్ చేసినందుకు మరోసారి నా తరుపున కృతజ్ఞతలు" అంటూ వర్మ తన ట్వీట్ లో రాసుకొచ్చాడు.

## అంతా చేస్తోంది 20 ఏళ్ల అమ్మాయి

అనుపమ ఫోటోలను మార్ఫింగ్ చేసి, ఆమె ఫ్యామిలీ, ఫ్రెండ్స్ అకౌంట్స్ కు ట్యాగ్ చేస్తుండటం ఎక్కువవడంతో అనుపమ ఈ విషయంపై కేరళ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాజాగా ఈ ఘటనపై స్పందిస్తూ అనుపమ సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తూ, తన గురించి అలా అసభ్యకర పోస్టులు చేసిందెవరో తెలిసిపోయిందంటూ పోస్ట్ చేశారు. ఆ పోస్ట్ లో అనుపమ ఇలా రాసుకొచ్చింది. కొన్నాళ్ల కిందట తన గురించి తప్పుడు వార్తలను, మార్ఫింగ్ ఫోటోలను పంచుతున్న ఓ అకౌంట్ కనిపించిందని, అదే వ్యక్తి ఎన్నో ఫేక్ అకౌంట్స్ ను క్రియేట్ చేసి, తనపై అవమానకార కామెంట్స్ చేస్తూ హేట్రెడ్ ను స్ప్రెడ్ చేశారని, దీంతో తాను కేరళ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశానని, విచారణలో ఇదంతా చేస్తున్నది ఒక 20 ఏళ్ల అమ్మాయి అని తెలిసి తాను షాకైనట్టు అనుపమ రాసుకొచ్చారు.



## మృణాల్ చేతిలో ఒక్క సినిమానే



బాలీవుడ్ లో సీరియల్స్ చేసి ఆ క్రేజ్ తో సిల్వర్ స్క్రీన్ ఛాన్స్ లు అందుకున్న మృణాల్ ఠాకూర్ తెలుగులో సీతారామం సినిమాతో ఎంట్రీ ఇచ్చింది. హను రాఘవపూడి డైరెక్షన్ లో తెరకెక్కిన సీతారామం సినిమా సూపర్ హిట్ అవ్వడంతో మృణాల్ ఠాకూర్ కి తెలుగులో మంచి పాపులారిటీ వచ్చింది. ఆ నెక్స్ట్ నానితో హాయ్ నాన్న చేసి మెప్పించింది మృణాల్ ఐతే థర్డ్ ప్రయత్నంగా విజయ్ దేవరకొండతో ఫ్యామిలీ స్టార్ సినిమా చేసింది కానీ అది వర్క్ అవుట్ అవ్వలేదు. 3 సినిమాలు తీస్తే రెండు హిట్లు ఒక ఫ్లాప్ పడగా అయినా కూడా మృణాల్ కి తెలుగులో సరైన అవకాశాలు రావట్లేదు. నిజంగానే మృణాల్ కి ఛాన్స్ లు రావట్లేదా ఒకవేళ వచ్చినా ఆమె కాదంటుందా అన్నది తెలియదు కానీ మృణాల్ ఠాకూర్ చేతిలో ఒకే ఒక్క తెలుగు సినిమా ఉంది. అది కూడా ముందు ఒక హీరోయిన్ తో ఆ ప్రాజెక్ట్ అనుకుని టీజర్ కూడా చేశాక మధ్యలో ఆ హీరోయిన్ హ్యాండ్సప్ చెప్పడంతో మృణాల్ కి ఛాన్స్ దక్కింది.



## మెగాస్టార్ 158 కోసం కనకవతి!

మెగాస్టార్ 158వ చిత్రం బాబి దర్శకత్వంలో లాక్ అయిన సంగతి తెలిసిందే. వాల్తేరు వీరయ్య తర్వాత ఇద్దరు మరోసారి చేతులు కలిపిన చిత్రమిది. మెగా మాస్ ఇమేజ్ ని దృష్టిలో పెట్టుకుని బాబి మార్క్ మాస్ చిత్రంగా ఉండ బోతుంది. అయితే ఈసారి కథ కోసం గ్రౌండ్ వర్క్ ఎక్కువగా చేసాడు బాబి. చిరుకు జోడీగా కన్నడ నటి రుక్మిణీ వసంత్ తో సంప్రదింపులు జరుపుతున్నారుట. ఇటీవలే రిలీజ్ అయిన కాంతార చాప్టర్ వన్ లో రిషబ్ శెట్టికి జోడీగా రుక్మిణి నటించిన సంగతి తెలిసిందే. రిషబ్ శెట్టి వయసు 42 ఏళ్లు అయినా 50 ఏళ్ల నటుడిలా ఉంటాడు.



## రామ్‌తో భాగ్యశ్రీ సంథింగ్..

టాలీవుడ్ యంగ్ హీరో, ఎనర్జిటిక్ స్టార్ రామ్.. ఇప్పుడు ఆంధ్రా కింగ్ తాలుకా మూవీతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్న విషయం తెలిసిందే. ఓ హీరో వీరాభిమాని కథగా రూపొందుతున్న ఆ సినిమాకు మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి ఫేమ్ పి.మహేష్ దర్శకత్వం వహిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ పై నవీన్ ఎర్నేని, రవిశంకర్ యలమంచిలి నిర్మిస్తున్నారు. సినిమాలో యంగ్ అండ్ క్రేజీ బ్యూటీ భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్ గా నటిస్తుండగా.. రామ్ తో ఆమెకు ఆన్ స్క్రీన్ లవ్ తోపాటు ఆఫ్ స్క్రీన్ లవ్ షూటింగ్ టైమ్ లో స్టార్ట్ అయిందని కొద్ది రోజులుగా సోషల్ మీడియాలో రూమర్లు వినిపిస్తున్న విషయం తెలిసిందే. దీనిపై ఇప్పటికే భాగ్యశ్రీ ఓసారి క్లారిటీ ఇచ్చినప్పటికీ.. ఎప్పటికప్పుడు వార్తలు వస్తూనే ఉన్నాయి. రీసెంట్ గా సీనియర్ నటుడు జగపతి బాబు హోస్ట్ చేస్తున్న జయమ్ము నిశ్చయమ్మురా టాక్ షోకు రామ్ గెస్ట్ గా విచ్చేశారు. ఆ సమయంలో ఏమైనా అఫైర్స్ ఉన్నాయా అని పరోక్షంగా క్వశ్చన్ వేశారు జగ్గూ భాయ్. దీంతో రిలేషన్ షిప్స్ విషయానికొస్తే.. తాను ఎప్పుడూ గోప్యంగా ఉంచడానికి ఇష్టపడతానని, అది తన పర్సనల్ మ్యాటర్ అని తెలిపారు. ఆ తర్వాత భాగ్యశ్రీ కేవలం హీరోయిన్ మాత్రమేనా లేక ఇంకేమైనా ఉందా అని జగ్గూ భాయ్.. మరో ప్రశ్న వేయగా, నవ్వుతూ ఊరుకున్నారు రామ్. దీంతో రామ్, భాగ్యశ్రీ లవ్ కు సంబంధించిన ఊహాగానాలు మళ్లీ ఊపందుకున్నాయి.





# చరిత్ర సృష్టించిన జకోవిచ్

## అత్యధిక హార్డ్ కోర్ట్ టైటిల్స్

- నొవాక్ జకోవిచ్-72
- రోజర్ ఫెదరర్-71
- ఆండ్రీ అగస్సీ-46

సెర్బియా దిగ్గజం నొవాద్ జకోవిచ్ తనదైన స్టైల్లో టెన్నిస్ చరిత్రలో ఓ అద్భుతమైన రికార్డును నెలకొల్పాడు. ఏథెన్స్‌లో జరిగిన హెల్లెనిక్ ఛాంపియన్‌షిప్ ఫైనల్‌లో లొరెంజో ముసెట్టిని ఓడించి తన కెరీర్‌లో 101వ ఏటీపీ టైటిల్‌ను సాధించడం ద్వారా ఈ అద్భుత ఘనతను అందుకున్నాడు. ఈ టైటిల్ గెలుపు జకోవిచ్‌కు కేవలం ఒక ట్రోఫీ మాత్రమే కాదు.. టెన్నిస్ ప్రపంచంలో ఓ మైలురాయిగా నిలిచింది. ఇది జకోవిచ్ కెరీర్‌లో 72వ హార్డ్ కోర్ట్ టైటిల్ అంతకుముందు స్విట్జర్లాండ్‌కు చెందిన లెజెండ్ రోజర్ ఫెదరర్ పేరిట అత్యధికంగా 71 హార్డ్ కోర్ట్ టైటిల్స్ రికార్డు ఉండేది. ఈ విజయం ద్వారా జొకోవిచ్ ఆ రికార్డును బద్దలు కొట్టి ప్రపంచంలోనే మొట్టమొదటి ఆటగాడిగా 72 హార్డ్ కోర్ట్ టైటిల్స్ సాధించిన ఘనతను తన ఖాతాలో వేసుకున్నాడు.



# 6, 6, 6, 6, 6, 6, 6, 6 వరుసగా 8 సిక్సులు..

## 11 బంతుల్లో 50.. ఆకాశ్ చౌదరి సంచలనం

**భారత క్రికెట్ చరిత్రలో ఓ కొత్త రికార్డు నమోదైంది. మేఘాలయకు చెందిన ఆకాశ్ కుమార్ చౌదరి రంజీ ట్రోఫీ ప్లేట్ గ్రూప్ మ్యాచ్‌లో అరుణాచల్ ప్రదేశ్‌పై వరుసగా 8 సిక్సర్లు బాదాడు. కేవలం 11 బంతుల్లోనే తన అర్థ సెంచరీని పూర్తి చేసి ఫస్ట్ క్లాస్ క్రికెట్లో అతి తక్కువ బంతుల్లో ఫాస్టెస్ట్ హాఫ్ సెంచరీ చేసిన ప్రపంచ రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు.**

ఈ మెరుపు ఇన్నింగ్స్‌తో భారత దిగ్గజం యువరాజ్ సింగ్‌ను కూడా ఈ రికార్డు విషయంలో అధిగమించాడు. గుజరాత్‌లోని సూరత్‌లో జరిగిన రంజీ ట్రోఫీ ప్లేట్ గ్రూప్ మ్యాచ్‌లో ఈ అద్భుత ఘట్టం ఆవిష్కృతమైంది. 25 ఏళ్ల రైట్ హ్యాండ్ బ్యాటర్ అయిన ఆకాశ్.. కేవలం 11 బంతుల్లో అర్ధ సెంచరీని పూర్తి చేసి ఫస్ట్-క్లాస్ క్రికెట్‌లో అత్యంత వేగవంతమైన హాఫ్ సెంచరీ చేసిన ప్రపంచ రికార్డును నెలకొల్పాడు. ఇంతకుముందు ఈ రికార్డు ఇంగ్లాండ్‌కు చెందిన వేన్ వైట్ పేరిట ఉండేది, ఆయన 2012లో 12 బంతుల్లో అర్ధ సెంచరీ సాధించారు. ఆకాశ్ ఇన్నింగ్స్‌లో అత్యంత ముఖ్యమైన విషయం వరుసగా సిక్సర్లు కొట్టడం. ఆకాశ్ ఎనిమిదో నంబర్‌లో బ్యాటింగ్‌కు దిగేసరికి మేఘాలయ జట్టు 6 వికెట్లకు 576 పరుగులు చేసింది. ఆ తర్వాత ఆకాశ్ బ్యాట్‌తో విధ్వంసం సృష్టించాడు. అతను కేవలం కొద్ది ఓవర్లలోనే అరుణాచల్ ప్రదేశ్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. ఇందులో భాగంగా బౌలర్ లీమర్ డాబీ వేసిన ఒకే ఓవర్‌లో వరుసగా 6 సిక్సర్లు సహా మొత్తం వరుసగా 8 సిక్సర్లు బాదాడు. ఇది టీ20 మ్యాచ్‌లలో కూడా అరుదైన దృశ్యం. ఆకాశ్ 14 బంతుల్లో 50 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. ఆ వెంటనే మేఘాలయ 6 వికెట్ల నష్టానికి 628 పరుగుల వద్ద ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. ఈ రికార్డు రంజీ ట్రోఫీకి మాత్రమే పరిమితం కాకుండా మొత్తం ఫస్ట్-క్లాస్ క్రికెట్ చరిత్రలో అత్యంత వేగవంతమైనది. టీమిండియా మాజీ స్టార్ యువరాజ్ సింగ్ 2007 టీ20 ప్రపంచకప్‌లో కేవలం 12 బంతుల్లో అర్ధసెంచరీ చేసి టీ20 ఫార్మాట్‌లో ప్రపంచ రికార్డు సృష్టించాడు. ఆకాశ్ కుమార్ ఫస్ట్-క్లాస్ క్రికెట్‌లో దానికంటే ఒక బంతి ముందే (11 బంతుల్లో) హాఫ్ సెంచరీ చేసి ఈ ఫార్మాట్‌లో యువరాజ్‌ను కూడా అధిగమించాడు.

# అభిషేక్, వరుణ్ చక్రవర్తిని ఆపితేనే

## టీ20 వరల్డ్ కప్‌లో ప్రత్యర్థులకు చాన్స్

## డిఫెండింగ్ ఛాంపియన్‌గా టీమిండియా: అశ్విన్

వచ్చే ఏడాది స్వదేశంలో జరగనున్న టీ20 ప్రపంచకప్‌లో సహ-ఆతిథ్య జట్టుగా బరిలోకి దిగుతున్న భారత్, టైటిల్ గెలుచుకోవడానికి తిరుగులేని ఫేవరెట్ అని టీమిండియా వెటరన్ ఆల్ రౌండర్ రవిచంద్రన్ అశ్విన్ అభిప్రాయపడ్డాడు. 2024లో రోహిత్ శర్మ కెప్టెన్సీలో టైటిల్ సాధించిన భారత్, ఈసారి సూర్యకుమార్ యాదవ్ సారథ్యంలో డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగనుంది. 2024లో బార్బడోస్‌లో దక్షిణాఫ్రికాపై గెలిచి కప్ సాధించిన తర్వాత రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, రవీంద్ర జడేజా వంటి సీనియర్లు రిటైర్మెంట్ ప్రకటించారు. గౌతమ్ గంభీర్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత జట్టులో కీలక మార్పులు జరిగినా.. గత 12 నెలలుగా టీమిండియా అద్భుత ఫామ్‌తో అసాధారణంగా ఆడుతోందని అశ్విన్ కొనియాడాడు. ఈ నేపథ్యంలో ప్రపంచకప్ గెలవాలని భావించే ఏ జట్టైనా భారత్‌ను ఓడించాలంటే ఇద్దరు కీలక ఆటగాళ్లను కట్టడి చేయాల్సి ఉంటుందని అశ్విన్ తన యూట్యూబ్ ఛానెల్‌లో విశ్లేషించాడు. "గతంలో అయితే జస్ప్రీత్ బుమ్రాను ఎదుర్కోవడం కీలకం అని చెప్పేవాడిని. కానీ, ఇప్పుడు నా అభిప్రాయం మారింది. వరుణ్ చక్రవర్తిని ఆస్ట్రేలియా ఆటగాడు టిమ్ డేవిడ్ ఎదుర్కొన్న తీరు చూశాక.. జట్లు అభిషేక్ శర్మ, వరుణ్ చక్రవర్తిని లక్ష్యంగా చేసుకుంటాయని నేను భావిస్తున్నాను" అని అశ్విన్ అన్నాడు. ఆస్ట్రేలియాతో జరిగిన టీ20 సిరీస్‌ను ఉదాహరణగా చూపుతూ అశ్విన్ తన వాదనను వివరించాడు. "ఈ సిరీస్‌లో ఆస్ట్రేలియా బౌలర్లు అభిషేక్ శర్మకు బలంగా ఉన్న జోన్లలో బౌలింగ్ చేయకుండా



ప్రయత్నించారు. భవిష్యత్తులో ఇతర జట్లు కూడా ఇదే వ్యూహాన్ని అనుసరిస్తాయి. అలాగే, హెూబార్ట్‌లో జరిగిన మూడో టీ20లో టిమ్ డేవిడ్.. వరుణ్ చక్రవర్తిపై ఆధిపత్యం ప్రదర్శించాడు. ప్రపంచకప్ కోసం వచ్చే జట్లు కూడా ఇదే తరహా ప్రణాళికలతో సిద్ధమవుతాయి" అని అశ్విన్ జోస్యం చెప్పాడు.



# ఐపీఎల్, డబ్ల్యూపీఎల్ వేలం డేట్స్ ఫిక్స్!

ఐపీఎల్ 2026 సీజన్‌కు సంబంధించిన ఆటగాళ్ల వేలం ఎట్టకేలకు స్వదేశానికి తిరిగి వచ్చింది. గత రెండు వేలం పాటలను దుబాయ్, సౌదీ అరేబియాలో జరపగా.. ఈ సారి ఇండియాలోనే నిర్వహించనున్నట్లు తెలిసింది. విదేశాల్లో వేలం జరుగుతుందన్న వార్తలకు తెరదించుతూ బీసీసీఐ వేలం తేదీలను ఖరారు చేసింది. మూడేళ్ల తర్వాత ఇండియాలో వేలం జరుగుతుండటంతో అభిమానుల్లో ఉత్సాహం నెలకొంది. ఓ నివేదిక ప్రకారం.. ఐపీఎల్ 2026 వేలం డిసెంబర్ 15న భారత్‌లో నిర్వహించనున్నారు. 2022 తర్వాత భారతదేశంలో జరుగుతున్న తొలి వేలం కావడం గమనార్హం. ఐపీఎల్‌లోని పది ఫ్రాంచైజీలు తమ రిటైన్ చేసుకునే ఆటగాళ్ల తుది జాబితాను నవంబర్ 15, 2025 లోగా బీసీసీఐకి సమర్పించాలి. ఐపీఎల్ 2026కి సంబంధించి అధికారికంగా రిటెన్షన్ నియమాలు ప్రకటించనప్పటికీ.. ఇది 'మినీ వేలం' తరహాలో ఉంటుంది కాబట్టి, గరిష్టంగా 15 మంది ఆటగాళ్లను రిటైన్ చేసుకునే అవకాశం ఉంది. అయితే, 'ట్రేడ్' విండో ద్వారా మరికొంత మంది ఆటగాళ్లను మార్పిడి చేసుకునేందుకు అవకాశం ఉంటుంది. సాధారణంగా ప్రతి సంవత్సరం పర్స్ విలువ పెరుగుతుంది. ఈసారి కూడా ఫ్రాంచైజీలకు వేలంలో ఖర్చు చేసేందుకు అధిక మొత్తం అందుబాటులో ఉండే అవకాశం ఉంది. ఇది జట్లకు మరింత మంది స్టార్ ఆటగాళ్లను కొనుగోలు చేసే వెసులుబాటునిస్తుంది. మహిళల ప్రీమియర్ లీగ్(డబ్ల్యూపీఎల్) చరిత్రలో మొట్టమొదటి మెగా వేలం జట్టు కూర్పులో విప్లవాత్మక మార్పులు తీసుకురానుంది. డబ్ల్యూపీఎల్ వేలం నవంబర్ 27 న ఢిల్లీ వేదికగా జరగనుంది. ఇది 'మెగా వేలం' కావడంతో జట్లు తమ జట్టును దాదాపుగా పూర్తిగా కొత్తగా నిర్మించుకోవాల్సి ఉంటుంది. డిఫెండింగ్ ఛాంపియన్ ముంబై ఇండియన్స్, రన్నరప్ ఢిల్లీ క్యాపిటల్స్ వంటి జట్లు గరిష్టంగా ఐదుగురు ఆటగాళ్లను మాత్రమే రిటైన్ చేసుకున్నాయి. మిగిలిన స్టార్ ప్లేయర్లందరూ వేలం పూల్‌లోకి వస్తారు. దీప్తి శర్మ (ఆల్‌రౌండర్), దక్షిణాఫ్రికా బ్యాటర్ లారా వోల్వార్ట్ వంటి ప్రపంచకప్ స్టార్ ప్లేయర్‌లు పూల్‌లోకి వస్తుండటంతో జట్ల మధ్య తీవ్ర పోటీ ఉంటుంది. ప్రపంచకప్ గెలిచిన భారత మహిళా జట్టులోని ఆటగాళ్లపై భారీ ధర పలికే అవకాశం ఉంది. స్వదేశంలో వేలం జరుగుతుండటం వల్ల ఫ్రాంచైజీలు ఆటగాళ్లను ఎంపిక చేసుకునే ముందు వారి గురించి మరింత లోతుగా విశ్లేషించుకోవడానికి అవకాశం ఉంటుంది. జట్లు తమ కోర్ గ్రూప్‌ను బలోపేతం చేసుకోవడానికి, ముఖ్యంగా ఫినిషర్లు, బౌలింగ్ విభాగాన్ని పటిష్టం చేసుకోవడానికి దృష్టి సారిస్తాయి. రిటెన్షన్ ద్వారా వదులుకున్న ఆటగాళ్లను 'రైట్ టు మ్యాచ్' కార్డు ద్వారా తిరిగి దక్కించుకునే అవకాశం ఉంటుంది. మొదటి మెగా ఆక్షన్ కాబట్టి జట్లు సమతుల్యమైన భారతీయ, అంతర్జాతీయ ఆటగాళ్ల కలయికతో ఒక బలమైన జట్టును తయారు చేసుకోవడానికి ప్రయత్నిస్తాయి. అనుభవం ఉన్న దేశీయ ప్లేయర్ల కోసం పోటీ ఎక్కువగా ఉంటుంది.



# శాంసన్‌ను తీసుకొని జడేజాను ఇచ్చేయండి!

ఇండియన్ ప్రీమియర్ లీగ్ పంతొమ్మిదో సీజన్ రిటెన్షన్, వేలం తేదీలు సమీపిస్తున్నాయి. ఆక్షన్ లోపే ట్రేడ్ పద్ధతిన ఆటగాళ్లను మార్చుకునేందుకు ఫ్రాంచైజీలు సిద్ధమవుతున్నాయి. పద్దెనిమిదో సీజన్ ముగిసినప్పటి నుంచి ప్రధానంగా సంజూ శాంసన్ గురించే చర్చ నడుస్తోంది. తనను వచ్చే సీజన్‌కు రీటైన్ చేసుకోవద్దని సంజూ చెప్పడంతో అతడిని ఇచ్చేసి మరొకరిని తీసుకునేందుకు జస్థాన్ రాయల్స్ యాజమాన్యం తీవ్రంగా ప్రయత్నిస్తోంది. మరోవైపు ఎంఎస్ ధోనీ వారసుడిగా సరైన కెప్టెన్ వేటలో ఉంది చెన్నై సూపర్ కింగ్స్. ట్రేడ్ డీల్‌కు రెఢీగా ఉన్న ఈ రెండు ఫ్రాంచైజీల మధ్య ఇటీవలే ప్రాథమిక చర్చలు జరిగాయి. ఈ నేపథ్యంలో ఒక ఆసక్తికర విషయం వెలుగులోకి వచ్చింది. గత నాలుగేళ్లుగా సారథిగా వ్యవహరిస్తున్న శాంసన్‌కు రాజస్థాన్ రాయల్స్ పద్దెనిమిదో సీజన్‌లో రూ.18 కోట్లు చెల్లించింది. మరో సీజన్ ఆడేందుకు అతడు ఆసక్తి చూపకపోవడంతో.. ట్రేడ్ పద్ధతిన వదిలించుకోవాలనుకుంటోంది రాజస్థాన్. అయితే.. అంతే ధర పలికే ఆటగాడి కోసం చూస్తున్న ఆ ఫ్రాంచైజీ సీఎస్కే ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజాను అడుగుతోంది. కానీ, తమ జట్టు కీలక ఆటగాళ్లలో ఒకడైన జడ్డూను ఇచ్చేందుకు చెన్నై సుముఖంగా లేదు. జడేజా కాకుండా డెవాల్డ్ బ్రెవిస్‌ను అప్పగించేందుకు సీఎస్కే అంగీకరిస్తున్నా తమకు మరొకరు కూడా కావాలని రాజస్థాన్ కోరుతోంది. పద్దెనిమిదో సీజన్ ఆఖర్లో సీఎస్కే జెర్సీతో అదరగొట్టిన ఈ సఫారీ కుర్రాడు ఇప్పుడు పెద్ద స్టార్ అయిపోయాడు. రాజస్థాన్ డిమాండ్ నేపథ్యంలో నవంబర్ 7న చెన్నై యాజమాన్యం, సీఈఓ, మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీలు సమావేశం కానున్నారు. ఈ మీటింగ్ ముగిశాక రాజస్థాన్ ట్రేడ్ డీల్‌పై స్పష్టత వచ్చే అవకాశముంది.



# ఆ ప్రయోగాలు ఆపండి: గంభీర్‌కు వార్నింగ్!

ఆస్ట్రేలియాపై టీ20 సిరీస్ విజయం సాధించిన తర్వాత భారత మాజీ ఓపెనర్, ప్రముఖ వ్యాఖ్యాత ఆకాష్ చోప్రా పేరు ప్రస్తావించకుండానే టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌కు గట్టి హెచ్చరిక చేశారు. టీ20 ప్రపంచ కప్ 2026 ప్రారంభానికి తక్కువ సమయం ఉన్నందున టీమిండియా ప్లేయింగ్ ఎలెవన్‌లో ప్రయోగాలు ఆపేయాలని ఆయన స్పష్టం చేశారు. టీమిండియా సూర్యకుమార్ యాదవ్ సారథ్యంలో ఐదు టీ20ల సిరీస్‌ను 2-1 తేడాతో గెలుచుకుంది. ఈ సిరీస్ సందర్భంగా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ భారత బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో అనేక ప్రయోగాలు చేశారు. సంజూ శాంసన్ బ్యాటింగ్ ఆర్డర్‌ను మార్చడం, ఆ తర్వాత అతడిని పూర్తిగా పక్కన పెట్టి బెంచ్ స్ట్రెంత్‌ను ఉపయోగించడం వంటివి జరిగాయి. ఆకాశ్ చోప్రా తన యూట్యూబ్ ఛానెల్‌లో మాట్లాడుతూ.. తర్కంతో కూడిన గట్టి హెచ్చరికను చేశారు.



ఆస్ట్రేలియాతో జరిగిన సిరీస్‌లో చేసిన ప్రయోగాలు ఇప్పుడు ఆపకపోతే, టీ20 ప్రపంచకప్‌కు ముందు తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన పేర్కొన్నారు. భారత జట్టులో ప్రయోగాల దశ నడుస్తోందని ఆకాశ్ చోప్రా అన్నారు. "జట్టులో ఎవరినైనా బ్యాటింగ్ ఆర్డర్‌లో పైకి లేదా కిందకు పంపవచ్చు. ఎవరికైనా ప్లేయింగ్ ఎలెవన్‌లో చోటు దక్కవచ్చు లేదా ఎవరినైనా తీసివేయవచ్చు. జట్టు దీనిని బహిరంగంగా అంగీకరించినప్పుడు, సరే మీరు ప్రయోగాలు చేసుకోండి అని అనుకున్నాము. ఆస్ట్రేలియాలో ఐదు టీ20ల సిరీస్ వర్షం కారణంగా మూడు మ్యాచ్‌లతోనే ముగిసింది. ఇప్పుడు టీ20 ప్రపంచకప్‌కు ముందు భారత జట్టు దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్‌తో 5-5 టీ20 మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. దీనిని దృష్టిలో ఉంచుకుని చూస్తే, ప్రయోగాల సమయం ముగిసింది అని నేను భావిస్తున్నాను. మనం చేయాల్సిన పని పూర్తి చేశాం. ఇప్పుడు మీరు ఎక్కువ ప్రయోగాలు చేయకూడదు, ఎందుకంటే ఫిబ్రవరిలో ప్రపంచకప్ ప్రారంభం కానుంది." అని ఆకాశ్ చోప్రా వెల్లడించారు.

ఈవార్తలు ప్రజావాణి
సంపాదకీయం
నేటి ఈవార్తలు
సోమవారం 10-11-2025
www.evarthalu.com



ప్రపంచ వ్యాప్తంగా ప్రచారంలో ఉన్న బౌద్ధమతానికి ఆది గురువైన గౌతమబుద్ధుడేనా? ఈయనేనా ఆ విష్ణువు.. లేక దశావతారాల్లోని బుద్ధుడు మరెవరైనా ఉన్నారా? అసలు బుద్ధుడి రహస్యం ఏమిటి? అప్పటిదాకా ప్రపంచం ఒక మార్గంలో నడుస్తోంది.. ఒక ధర్మాన్ని అనుసరిస్తూ వెళ్లింది.. ఆ మార్గంలో ఉన్న ముళ్లను తొలగించి.. ఆ ధర్మంలో ఉన్న లోపాలను ఎత్తి చూపి సరికొత్త మార్గాన్ని చూపించిన ఆధ్యాత్మిక గురువు గౌతమబుద్ధుడు. దాదాపు పదిహేను వందల సంవత్సరాల క్రితం మనకు తెలిసిన కాలంలో.. మనకు తెలిసిన చరిత్రలో ఈ భూమిపై నడచిన మూర్తి.. హిందు జాతిలో ఉన్న విశ్వాసాలతో విభేదిస్తూ ఒక విధమైన విప్లవాత్మకమైన ధోరణితో దూసుకువచ్చిన వాడు బుద్ధుడు. ఇప్పుడున్న నేపాల్లోని కపిలవస్తునగరాన్ని ఏలుతున్న మహారాజు కడుపున పుట్టి శక్తిమంతుడైన మతాచార్యుడిగా అవతరించిన పుణ్యమూర్తి. జీవితం -చావు.. ఈ రెండింటి గురించి సిద్ధార్థుడనే రాజకుమారుడికి తీవ్రంగా వచ్చిన సందేహాలు అతణ్ణి బుద్ధుడిగా మార్చేశాయి. ఊరూరా తిరిగి తిరిగి అలసిపోయిన యువరాజుకు గయలో ఓ బోధి వృక్షం ఆశ్రయమిచ్చింది.. జ్ఞానాన్ని ప్రసాదించింది... సందేహాలన్నింటినీ పటాపంచలు చేసింది. 375 జన్మలు ఎత్తిన వాడు.. ఆ తరువాత కూడా ఆచార్యుడిగా అవతరిస్తున్న వాడు.. అన్ని కాలాల్లో ఉన్నవాడు.. అన్ని ధర్మాలకు అతీతమైన ధర్మాన్ని లోకానికి అందించిన వాడు.. ఈయనకు విష్ణుమూర్తికి సంబంధం ఏమిటి? విష్ణువు దశావతారాలతో ఉన్న అనుబంధం ఏమిటి? నారాయణుడే తన తొమ్మిదవ అవతారంలో గౌతమబుద్ధుడిగా అవతరించాడా? ఇది నిజమేనా? దశావతారాల్లో ఉన్న బుద్ధుడికి, గౌతమబుద్ధుడికి సంబంధమే లేదా? అలాంటప్పుడు ఆ అవతారంలో ఉన్న బుద్ధుడు ఎవరు? విష్ణువు

# బుద్ధుడు విష్ణువు అవతారమా?

**విష్ణుమూర్తి దశావతారాలు..**
**మత్స్యకూర్మ వరాహ నారసింహ..**
**ఇలా చెప్పేసుకుంటూ వెళ్తాం..**
**ఈ వరుసలోనే విష్ణుమూర్తి తొమ్మిదవ అవతారంగా విష్ణుమూర్తి బుద్ధుడిగా ఆవిర్భవించాడని హిందువులు విశ్వసిస్తారు.**
**కానీ, నిజంగా విష్ణువే బుద్ధుడిగా అవతరించాడా? బుద్ధుడు విష్ణువేనా? అసలు ఈ బుద్ధుడు ఎవరు?**



దశావతారాలు ఒట్టి కథలు కావు.. పుక్కిటి పురాణాలుగా వీటిని కొట్టిపారేయలేం.. వీటి వెనుక పౌరాణిక వాస్తవాల సంగతి ఎలా ఉన్నా.. వీటి వెనుక సైంటిఫిక్ లాజిక్ మాత్రం అత్యద్భుతంగా ఉంటుంది. భూమ్మీద జీవరాశి పుట్టినప్పటి నుంచి దాని పరిణామ క్రమాన్ని వ్యక్తం చేసేంది దశావతారం కాన్సెప్ట్. అందులో తొమ్మిదో అవతారం బుద్ధుడని హిందువులు విశ్వసిస్తారు.. అయితే ఆ బుద్ధుడు.. గౌతమబుద్ధుడేనా అన్నదాంట్లో క్లారిటీ ఉందా? పురాణాల ప్రకారం విష్ణువు వందల అవతారాలు ధరించాడట.. కానీ మనకు తెలిసినవి పదే.. అందులో తొమ్మిది ఇప్పటికే అవతరించేశాడు.. పదో అవతారం కోసం ఇప్పుడున్న ప్రజానీకం చాలా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇప్పుడు అందరి విశ్వాసమూ ఈ గౌతమ బుద్ధుడే విష్ణుమూర్తి తొమ్మిదో అవతారమని. అద్వైత, విశిష్టాద్వైత మతాల మధ్య హిందువుల్లో సంక్లిష్టంగా మారిన విశ్వాసాలు పెడదారిన పడినప్పుడు అవతరించిన వాడు బుద్ధుడనేది అందరి నమ్మకం.. కానీ, మనకు తెలిసిన బుద్ధుడు విష్ణువు కాదనేది మరో వాదన. ఎందుకంటే, దశావతారాల్లో ఉన్న బుద్ధుడు వేరే ఉన్నాడు. దుష్టశిక్షణ సక్రమంగా జరిగేందుకు విష్ణువు రామకృష్ణుల అవతారాల మధ్యలో బుద్ధుడిగా ఆవిర్భవించాడు.

మనకు తెలిసిన గౌతమబుద్ధుడు మరో అవతార పురుషుడే కానీ, దశావతారాల్లో ఒకరు కాకపోవచ్చు. క్రీస్తు పూర్వం 563వ సంవత్సరంలో భారతదేశంలో శైవ, వైష్ణవ, శాక్తేయ మతాలను ధిక్కరిస్తూ.. అందులోని లోపాలను తిప్పికొడుతూ గౌతమబుద్ధుడు సమాజానికి కొత్త దిక్సూచి అయి నిలిచాడు. ఇప్పుడు నేపాల్లో ఉన్న కపిలవస్తు నగరాన్ని ఏలుతున్న శుద్ధోధనుడనే రాజుకు జన్మించిన సిద్ధార్థుడు.. అందరిలాగే రాజభోగాలను అనుభవించిన వాడే. దాదాపు 29 సంవత్సరాలు అన్ని సుఖాలనూ అనుభవించాడు. వైవాహిక జీవితాన్నీ అనుభవించాడు. ఓ కుమారుడికి తండి అయ్యాడు. కానీ ఆ తరువాతే ఆయన జీవితం మారిపోయింది. సందేహాల పుట్టగా మారి, చివరకు జీవించటమే నరకంగా భావించే పరిస్థితి నెలకొంది. ఇల్లు, సంసారం వదిలి బయటకు వెళ్లిన సిద్ధార్థుడు, కౌండిన్యుడనే యోగి దగ్గర కొంతకాలం శిష్యరికం కూడా చేశాడు. కానీ, ఆ శిష్యరికం సంతృప్తినివ్వలేదు, సందేహాలు తీరలేదు. గురువునూ వదిలి తిరిగి తిరిగి చివరకు గయకు చేరుకున్నాడు. అక్కడ ఓ రావిచెట్టు సిద్ధార్థుడికి ఆశ్రయాన్నిచ్చింది.. ఆ చెట్టే ఆయనకు నివాసమైంది. ఆ చెట్టు కిందే జ్ఞానోదయమైంది. ఈ జ్ఞానంతో సిద్ధార్థుడు గౌతముడయ్యాడు.. గౌతముడు బుద్ధుడయ్యాడు.. త్రిపీటికలతో నూతన ఆధ్యాత్మిక ప్రపంచానికి ఆదిగురువై నిలిచాడు. ఆయన బోధనలు ప్రపంచానికి తలమానికమై నిలిచాయి. సత్యాహింసలు మహాస్త్రాలుగా తయారయ్యాయి. అందువల్లే ఆయన విష్ణుమూర్తి అవతారంగా భావిస్తారు. ఆయన బోధనలు.. ధర్మ రక్షణా మార్గం ఆయన్ను అవతారపురుషుడిగా మార్చాయి.

బుద్ధుడిగా మనకు విడిగా కనిపిస్తున్న మరో రూపం పౌరాణిక గాథల్లో ప్రముఖంగా కనిపిస్తుంది. ఇది చాలా మందికి తెలియని విషయం. గౌతమ బుద్ధుడి మాదిరిగానే పౌరాణిక బుద్ధుడికీ రావిచెట్టుతో అనుబంధం ఉంది. పౌరాణిక బుద్ధుడు విష్ణుమూర్తి అంశతోనే అవతరించాడు. యుగాలకు అందని పౌరాణిక గాథ ఇది. జనాలను నానా అవస్థలు పెడుతున్న త్రిపురాసురుడనే రాక్షసుణ్ణి విష్ణుమూర్తి చంపాల్సి వచ్చింది. కానీ, అతణ్ణి హతమార్చటం ఎవరివల్లా కావటం లేదు. కారణం ఏమిటో తెలియదు.. ఏం చేయాలో దేవతలకు అర్థం కావటం లేదు. చివరకు అతని ప్రాణాలను కాపాడుతున్నది అతని భార్యలేనని విష్ణుమూర్తికి అర్థమైంది. వాళ్ల పాతివ్రత్యం వల్లనే త్రిపురాసురుడు బతకగలుగుతున్నాడని ఫైనల్ కనూషన్కు వచ్చేశాడు నారాయణుడు. అప్పుడు ఆ రాక్షసుడి భార్యల పాతివ్రత్యాన్ని భంగం చేసేందుకు విష్ణుమూర్తి వాళ్ల దగ్గరకు బుద్ధుడి వేషంలో వెళ్లి అశ్వత్థ వ్రతాన్ని చేయమని ఉపదేశిస్తాడు. వ్రతం ముగిసిన తరువాత అశ్వత్థ వృక్షాన్ని కౌగిలించుకోవాలని చెప్తాడు. వాళ్లు అలా చేస్తున్న సమయంలో అశ్వత్థవృక్షంగా తానే నిలిచి పాతివ్రత్యభంగం చేస్తాడు. ఆ తరువాత త్రిపురాసుర సంహారం తేలిగ్గా జరిగిపోతుంది. ఇక్కడ అశ్వత్థ వృక్షం అంటే మరేదో కాదు.. రావిచెట్టే... ఇదే బోధి వృక్షం.. ఇక్కడ పతివ్రతలకు వ్రతభంగం చేసిన వాడు మరెవరో కాదు.. విష్ణువే.. ఇతడే దశావతారాల్లో మనకు కనిపించే బుద్ధుడు.. కాకపోతే ఈ కథనానికి విష్ణుకథల్లో పెద్దగా ప్రాధాన్యం కనిపించదు.. అశ్వత్థ వృక్షాన్ని పూజించటం.. పతివ్రతల గొప్పతనాన్ని వివరించటం కోసమే ఈ కథనం చెప్పుకొచ్చారు.

నిజానికి దశావతారాలను ఒక క్రమ పరిణామం ప్రకారం కనుక స్వీకరించినట్లయితే, గౌతమ బుద్ధుడిని తొమ్మిదో అవతారంగా గుర్తించాల్సి ఉంటుంది. ఎందుకంటే, విష్ణువు అవతారాల్లో మొదటి అయిదు.... అంటే మత్స్య, కూర్మ, వరాహ, నారసింహ, వామన- అన్నీ కృతయుగంలో జరిగాయి. ఆ తరువాత త్రేతాయుగానికి వచ్చేసరికి పరశురామ, రామావతారాలు వచ్చాయి. ద్వాపరంలో కృష్ణావతారం సంభవించింది. కృష్ణ నిర్యాణంతోనే ద్వాపరం ముగిసిపోయి కలియుగం మొదలైంది. కలియుగంలో హిందూ సమాజానికి సంబంధించినంత వరకు అవతరించిన మహాపురుషుడు గౌతమ బుద్ధుడే. అందుకే దశావతారాల బుద్ధుడు పౌరాణిక బుద్ధుడు కాదు.. కపిల వస్తుపురంలో జన్మించిన సిద్ధార్థుడే ఈయన. ద్వాపరాంతంలో కృష్ణ నిర్యాణానికీ, క్రీస్తుపూర్వం 563లో గౌతమబుద్ధుడు అవతరించటానికి మధ్యలో సాగిపోయిన 2500 సంవత్సరాల కాలం ప్రపంచ సమాజాన్ని అస్తవ్యస్యం చేసిన కాలం. అన్ని మతాల మధ్యన సామరస్యం లోపించిన సమయంలో గౌతమ బుద్ధుడు అత్యున్నతమైన అహింస, ధర్మ పరిరక్షణ మార్గాలుగా మతాన్ని నిర్మించిన మహాపురుషుడాయన. ఆయన విష్ణువా, కాదా అన్నది ప్రశ్న కానే కాదు.. ఆయన విశ్వానికి మార్గదర్శి.. ఇది మాత్రమే సత్యం.. ఇదే నిజం. గౌతమబుద్ధుడు జీవితం ఎలా గడపాలో చెప్పిన వాడు.. మానవత ఆయన మతం.. ధర్మం ఆయన మార్గం... అహింస ఆయన వ్యక్తిత్వం. అందుకే అందరికీ ఆయన శరణయ్యాడు.. బుద్ధం శరణం గచ్ఛామి.



**కోవెల సంతోష్ కుమార్**
రచయిత,
9052116463

## రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!

పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.